తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

మంగళవారం 17 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

వెట్టి చాకిరీకి తావులేకుండా చూడాలి

యాజమాన్యాలకు కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశాలు



నల్లగొండ, నవంబర్ 16,(జనం సాక్షి):
ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు తదితర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడా వెట్టి చాకిరీ ఉండకూడదని, కార్మికుల సంక్షేమానికి యాజమాన్యాలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్మికులకు రక్షిత మంచినీరు, నివాసం, విద్య, వైద్యం వంటి సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీల సంక్షేమం, వెట్టి చాకిరీ నివారణ తదితర అంశాలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూలీలకు అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. మైనర్లు, గర్భిణులు, బాలింతలను పనుల్లో నియమించకూడదని హెచ్చరించారు.ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాల్లో పనిచేస్తున్న కార్మికుల పూర్తి వివరాలను ముందుగానే నమోదు చేయాలని, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్మికుల నివాసాలకు అనువైన వసతులు ఏర్పాటు చేయడంతో పాటు నిర్దేశించిన నమూనాలో వివరాలను అధికారులకు సమర్పించాలన్నారు. ప్రతి పని ప్రదేశంలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.కార్మికుల పిల్లలకు విద్య, వైద్యంతో పాటు ఇతర అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సీఆర్‌పీలు, ఎంఈవోలు, ఏఎన్‌ఎంలు తరచూ పని ప్రదేశాలను సందర్శించి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్మికులకు విద్య, వైద్యం, రేషన్ అందుతున్నాయా లేదా అనే విషయాలను పర్యవేక్షించాలని సూచించారు. తనిఖీలకు వచ్చే అధికారులకు ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాల యజమానులు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఉప కార్మిక సహాయ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు పోలీస్ శాఖ పై నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలి

ప్రజా దివాస్ లో బాధితుల నుండి పిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం టౌన్ నవంబర్ (16) జనంసాక్షి
ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించతున్న ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురి 25 మంది బాధితుల పిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు ఈ సందర్భంగా భువివాదాలు. కుటుంబ వ్యక్తిగత. ఆర్థిక సమస్యలతోపాటు బార్య భర్తల సమస్యల తో వచ్చిన బాధితులు తమ పిర్యాదులు పోలీస్ కమిషనర్ కు అందజేశారు ప్రతి పిర్యాదు ను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య ల పరిష్కారం కోసం చట్ట పరిధిలో పరిష్కరించాలని అధికారుల ను ఆదేశించారు ప్రతి పిర్యాదు ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారు లు పనిచేయాలనిపిర్యాదుల పరిష్కారం లో పారదర్శక తతో పాటు బాధితుల కు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.



భద్రాచలంలో డయాలసిస్ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు చేతుల మీదుగా శంకుస్థాపన

భద్రాచలం నవంబర్ 16 (జనంసాక్షి):
భద్రాచలం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పట్టణంలో నూతన డయాలసిస్ కేంద్రం నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు చేతుల మీదుగా కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రాచలం పరిసర ప్రాంతాలతో

మిగతా 3లో



బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 16 (జనంసాక్షి)
బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణిని సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు డా. పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి లతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు పిల్లలు, వారి తల్లిదండ్రులతో హాజరై జిల్లా కలెక్టర్ కు దరఖాస్తులు సమర్పించారు . కార్యక్రమంలో మొత్తం 19 అప్లికేషన్స్ రాగా, వాటిని పరిష్కారం కొరకు స్పాన్సర్షిప్ కొరకు జిల్లా సంక్షేమ అధికారిణి కి, ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్స్ కొరకు గాను ఈజిల్లా మేనేజర్, అంగ వైకల్య ధృవీకరణల కొరకు గాను డిఆర్డీఏ పిడి కి, ఫీజు రీయంబర్స్మెంట్ కొరకు గాను జిల్లా విద్యాధికారిణికి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. దరఖాస్తులను సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని వెంటనే పరిష్కరించాలని, పరిష్కార చర్యలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పోషణ, హక్కులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోనేలా చర్యలు చేపట్టనున్నట్లు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ఏ. ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి టి. విష్ణువందన, కార్మిక అధికారిణి వెంగమాంబ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డా. లక్ష్మీనారాయణ, సి.సి.ఆర్బి. సి.ఐ. రమేష్, డి.సి.పి.యూ. సిబ్బంది సోనీ, యశోద, శ్రీ లక్ష్మి, నిరోషా, స్రవంతి, సందీప్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రౌద్రం చూపిస్తున్న కాంట్రాక్టర్.. దండం పెట్టినా కరగని మనసు!

- మాడుగులపల్లి - ఎల్లమ్మగూడెం రోడ్డు పనుల్లో కనీస నిబంధనలకు తూట్లు
- నీళ్లు చల్లకపోవడంతో దుమ్ము కొట్టుకుపోతున్న సుందర్ నగర్ కాలనీ
- అన్నంలోనూ మట్టి తింటున్నామంటూ స్థానికుల కన్నీరు
- కాళ్లావేళ్లా పడి దండం పెట్టినా దిక్కులేకుండా పోయింది - రాచకొండ నాగరాజు ఆక్రోశం

మాడుగులపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి):
అభివృద్ధి పేరిట జరుగుతున్న రోడ్డు పనులు సుందర్ నగర్ కాలనీ వాసుల పాలిట మృత్యుపాశంగా మారాయి. నల్గొండ జిల్లా మాడుగులపల్లి నుండి ఎల్లమ్మగూడెం వరకు సాగుతున్న రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న తీరు స్థానికుల సహనాన్ని పరీక్షిస్తోంది. దుమ్ము లేవకుండా నీళ్లు చల్లాలన్న కనీస నిబంధనను గాలికొదిలేసి, ప్రశ్నించిన ప్రజలపైనే కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లు జులుం ప్రదర్శిస్తున్నారు.

మట్టి తింటూ బతకాలా?.. కాలనీ వాసుల ఆగ్రహం

నిత్యం పదుల సంఖ్యలో మట్టి టిప్పర్లు రయ్‌మని దూసుకెళ్తుండటంతో సుందర్ నగర్ ఇళ్లన్నీ దుమ్ము గూళ్లుగా మారాయి. ఇంట్లో వండుకున్న ఆహారంలోనూ దుమ్ము కణాలు చేరుతుండటంతో, పచ్చి మట్టిని

మిగతా 2లో



జాతీయస్థాయి స్కేటింగ్ కు స్మార్ట్ కిడ్జ్ విద్యార్థిని ఎంపిక

- ఇద్దరు విద్యార్థులకు రాష్ట్రస్థాయి మెడల్స్
- చిన్నారులను అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య





ఖమ్మం నవంబర్ 16, (జనంసాక్షి) :

వచ్చేనెల 5వ తేదీన బెంగుళూరులో జరిగే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు స్మార్ట్ కిడ్జ్ విద్యార్థిని పసుపులేటి వీక్ష ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య తెలిపారు. ఈనెల 13వ తేదీన హైదరాబాద్లో జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో పాఠశాలకు చెందిన పసుపులేటి వీక్ష సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ గెల్చుకోగా మరో విద్యార్థిని పసుపులేటి శ్రీనిక బ్రాంజ్ మెడల్ గెల్చుకున్నారు. రాష్ట్రస్థాయిలో బ్రాంజ్,సిల్వర్ మెడల్స్ గెలుచుకున్న పసుపులేటి వీక్షను జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక చేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన, రాష్ట్రస్థాయి స్కేటింగ్లో ప్రతిభ కనబరిచిన పసుపులేటి వీక్ష, పసుపులేటి శ్రీనికలను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులను చదువుతోపాటు క్రీడా,సాంస్కృతిక విషయాలలో తీర్చిదిద్దడం వల్లనే జాతీయస్థాయిలో పాఠశాల ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకరవాయిలో ఘనంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్లే శంకుస్థాపన కార్యక్రమం

ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు.. పాల్గొన్న లబ్ధిదారులు

మండల కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి

తిరుమలాయపాలెం నవంబర్ 16 (జనంసాక్షి)

పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ముందుకు సాగుతుండటంతో లబ్ధి దారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సొంతింటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు తిరుమలాయపాలెం మండలం లోని కాకరవాయి గ్రామంలో సోమవారం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కావడంతో గ్రామంలో నూతన గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో



కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కట్కూరి శ్రీనివాసరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కటుకూరి జ్యోత్స్న, మోరపాక నాగయ్య, తవడబోయిన కృష్ణ, గుండాల మహేష్, నల్లగట్టు సునీత పాల్గొన్నారు.అలాగే శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ మరియు సభ్యులు గుండాల లింగయ్య, కొత్తపల్లి వెంకటరెడ్డి, కొత్తపల్లి మల్లయ్య, గుండెబోయిన శ్రీశైలం, నల్లగట్టు గురవమ్మ, వార్డు మెంబర్లు కొత్తపల్లి ఉష రవి, ధర్మపురి భవాని మల్సూర్, ధర్మపురి నాగరాజు, అన్నం రజిత రమణారెడ్డి, కొత్తపల్లి వసంత రవి పాల్గొన్నారు.కాంగ్రెస్ యువజన నాయకులు దామెర్ల కృష్ణ, బండారి గంగరాజు, కొత్తపల్లి సురేష్, నల్లగట్టు మల్సూర్, నల్లగట్టు ప్రభాకర్, నల్లగట్టు నగేష్తో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఎం నిరసన

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 16 (జనం సాక్షి):ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని అర్హులైన వారికి అధికారులు ఎంక్వైరీ చేసి వెంటనే పెన్షన్ లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భుక్యా శ్రీనివాసురావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ ఖమ్మం డివిజన్ పరిధిలోని 60 డివిజన్స్ లలో, మరియు రఘునాథ పాలెం మండలంలో పెన్షన్ లు పొందటానికి వందల సంఖ్యలో అర్హత వున్న ప్పటికీ పేదలకు తాజా పెన్షన్ జాబితాలో వారి పేర్లు లేవు అని ఆందోళన వ్యక్తం చేశారు. వితంతువు లకు పెన్షన్ లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసింది అని కానీ ఆచరణలో ఇంకా వందల సంఖ్యలో వితంతువులను ఎంపిక చేయలేదు అని విమర్శించారు. 57 సంవత్సరాలలు నిండిన వృద్ధాప్య పెన్షన్ లు గురించి అధికారులు ఏమి సమాధానం చెప్పడం లేదు అని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఖమ్మం అసెంబ్లీ పరిధిలో కొద్దిమంది కి మాత్రమే పెన్షన్ లు మంజూరు చేసింది అని, కానీ ప్రతి డివిజన్ లో పెద్ద సంఖ్యలో అర్హత వున్న పేదలకు పెన్షన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వెంటనే అర్హత వున్న వారికి పెన్షన్ లు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మూడు సంవత్సరాల తర్వాత కొద్దిమంది కి మాత్రమే పెన్షన్ లు ఇచ్చి చేతులు దులుపుకుంటే ప్రజల ఆగ్రహాన్ని చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది అని హెచ్చరించారు. పెన్షన్ 2 వేలు నుంచి 3 వేలు పెంచుతాం అని చెప్పిన హామీ కూడా అమలు కాలేదు అని విమర్శించారు. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో పేద ప్రజలు పెన్షన్ లు కోసం కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా పెన్షన్ లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి డివిజన్ లో అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి కొత్త పెన్షన్ దారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అర్హత వున్న వారికి పెన్షన్ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.అనంతరం కమిషనర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మరోసారి అధికారులను పంపించి అర్హత వున్న వారికి పెన్షన్ లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి విష్ణు , జబ్బార్, దొంగల తిరుపతిరావు, ఎస్ నవీన్ రెడ్డి, జెల్లా ఉపేంద్ర, నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, మాజీ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, బేగం తదితరులు పాల్గొన్నారు.

రౌద్రం చూపిస్తున్న కాంట్రాక్టర్..

దండం పెట్టినా కరగని మనసు!



తినాల్సిన దుస్థితి దాపురించిందని బాధితులు మండిపడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరవుతూ శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

దండం పెట్టినా కనికరించని

కఠినాత్ములు:రాచకొండ నాగరాజు

ఈ దుర్భర పరిస్థితిపై స్థానిక నివాసి రాచకొండ నాగరాజు జనం సాక్షి ప్రతినిధి ఎదుట తన ఆవేదనను, ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. అయ్యా.. మేము బతకలేకపోతున్నాం, కాస్త నీళ్లు కొట్టించండి అని సదరు సూపర్వైజర్కు చేతులెత్తి దండం పెట్టి వేడుకున్నాం. అయినా వారి మనసు కరగలేదు. పైగా పనులు జరిగేటప్పుడు ఇలాగే ఉంటుంది మీ దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ రౌడీల్లా బెదిరిస్తున్నారు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక నరకం అనుభవిస్తున్నాం అంటూ ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల మొద్దునిద్ర వీడేదెప్పుడు?

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ, ఎదురు బెదిరింపులకు దిగుతున్న కాంట్రాక్టర్పై సంబంధిత ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు మొద్దునిద్ర వీడి, తక్షణమే ఉదయం, సాయంత్రం రోడ్డుపై నీళ్లు చల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని సుందర్ నగర్ వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా

రాజారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

తిరుమలాయపాలెం నవంబర్ 16 (జనంసాక్షి)



అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందింది. తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గత ఏడాది అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించేందుకు పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్‌రెడ్డి చొరవ తీసుకున్నారు.ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సిఫారసుతో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును సోమవారం ఖమ్మంలోని కందాల ఉపేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో అండగా నిలిచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో సీఎంఆర్ఎఫ్ సహాయం అందడం తమ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాజారం గ్రామ శాఖ అధ్యక్షులు రంగాపురం బాలకృష్ణ గౌడ్, వార్డు సభ్యులు బాణాల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సామ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రంతో పెన్షన్ తీసుకుంటున్న వ్యక్తిపై ప్రజావాణిలో ఫిర్యాదు

పెనుబల్లి నవంబర్ 16 (జనంసాక్షి)



పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన యరమల శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి తప్పుడు వికలాంగ ధ్రువీకరణ పత్రంతో పెన్షన్ తీసుకుంటున్నాడని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ముత్తగూడెం గ్రామానికి చెందిన వి. వెంకటేశ్వర రెడ్డి కే. శ్రీనివాస్ రెడ్డి తోపాటు గ్రామస్తులు కొందరు యరమల శ్రీనివాస్ రెడ్డి పై ఎంపీడీవో వీరస్వామి కి ఫిర్యాదు చేశారు. అర్హత లేకపోయినా తప్పుడు ధ్రువీకరణ పత్రంతో గత పది సంవత్సరాల నుండి వికలాంగు పెన్షన్ తీసుకుంటూ అర్హులైన అసలైన వికలాంగులకు అన్యాయం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే అతని పెన్షన్ రద్దు చేసి అర్హులైన అసలైన వికలాంగులకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



శివుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి):

కార్తీకమాసం మొదటి సోమవారం పురస్కరించుకొని అర్వపల్లిలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం తో పాటు పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శివుడికి అభిషేకాలు జరిపారు. ఆయా కార్యక్రమాలలో అర్చకులు, మహిళలు, భక్తులు పాల్గొనడం జరిగింది.

తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా

జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి):

జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన చిర్రబోయిన యాదగిరి ఇటీవల అకాల మరణం చెందారు. ఆయనతో కలిసి తిమ్మాపురం జడ్పీహెచ్ఎస్‌లో 2001 పదో తరగతి చదివిన తోటి విద్యార్థులు స్పందించి, తమ వంతు సహాయంగా రూ. 25,000 విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని యాదగిరి భార్య కృష్ణవేణికి సోమవారం అందజేసి ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. తమ బ్యాచ్‌లో ఏ ఒక్కరికి ఆపద వచ్చినా ఎప్పుడూ అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటి విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ అందజేత చిట్యాల

ప్రభుత్వ పాఠశాలలకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ అందజేత

చిట్యాల, నవంబర్ 16 (జనంసాక్షి):

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి దాస్ సేవా సమితి ప్రతి సంవత్సరం తన వంతు సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగా సమన్వయకర్త, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నూరు నర్సింగరావు చొరవతో ఈ విద్యా సంవత్సరంలో 30 పాఠశాలలకు పబ్లిక్ అడ్రస్ వ్యవస్థలను అందించాలని సమితిని కోరారు.ఈ క్రమంలో చిట్యాల మండలంలోని బోయగుబ్బ, పిట్టంపల్లి, నేరెడ, చిట్యాల, చిన్నకాపర్తి, గుండ్రాంపల్లి, సుంకెనపల్లి, తాళ్లవెల్లంల, పెరేపల్లి గ్రామాల్లోని మొత్తం తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలకు పబ్లిక్ అడ్రస్ వ్యవస్థలను అందజేశారు. ఈ పరికరాలను నవంబర్ 15న హైదరాబాద్‌లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, సమితి అందించిన పరికరాలను విద్యార్థుల అభివృద్ధికి, బోధనా కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాస్ సేవా సమితికి, సమన్వయకర్తగా కృషి చేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నూరు నర్సింగరావుకు కృతజ్ఞతలు తెలిపారు.





ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన పోలీసు అధికారులకు అభినందనలు

- ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి..
- బ్యాడ్జీలు అలంకరించిన సీపీ సునీల్ దత్

ఖమ్మం టౌన్, నవంబర్ 16 (జనంసాక్షి):

వివిధ పోలీస్‌స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన ఐదుగురు పోలీసు అధికారులను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. డి.కొండయ్య, టి.వెంకటేశ్వర్లు, వి.నరసింహారావు, ఎన్.హరిప్రసాద్, వి.జయరాజులకు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పదోన్నతి బ్యాడ్జీలు అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి పొందిన అధికారులు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాలకు బదిలీపై వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు హేమనాథ్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

ప్రజావాణిలో దరఖాస్తు చేసిన గుడిపల్లి గ్రామ సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి



పి.ఏ.పల్లి,నవంబర్ 16(జనంసాక్షి):

గుడిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని గుడిపల్లి గ్రామ సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కోరారు.ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అధికారులకు దరఖాస్తు సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా నిజమైన అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలతో పాటు,క్వార్టర్స్‌లో ఉంటూ ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామంలో వాస్తవంగా ఇల్లు లేని నిరుపేదల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాలని,ఈ ప్రక్రియ గ్రామ పాలకవర్గం,గ్రామ ప్రథమ పౌరుడి సమక్షంలో పారదర్శకంగా జరగాలని అధికారులను కోరారు.ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిజమైన లబ్ధిదారులకు చేరినప్పుడే ఆ పథకానికి సార్థకత చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం

హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి



హాలియా నవంబర్ 16 (జనంసాక్షి):

సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరమని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సీఎం సహాయనిధి ఆరుగురు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు: అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల భారాన్ని ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా అండే సాయం ఊరటనిస్తుందని పేర్కొన్నారు. సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న వారు మారోజు నాగశ్రీ, బొడ్డుపల్లి ధనమ్మ, చింతకాయల ఎల్లమ్మ, మర్రి పద్మ, రాపోలు నాగమణి, దొడ్డు కోటేష్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు, బొంగరాల ఏసు రాజు, కౌన్సిలర్ల సలహాదారులు నకిరెకంటి సైదులు, ఎండీ మజార్ మోహినిద్దీన్, పిల్లి అంజనేయులు, ఎడవల్లి రంజిత్, అడ్వకేట్ కొమనబోయిన శేఖర్ పాల్గొన్నారు

భద్రాచలంలో డయాలసిస్ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు చేతుల మీదుగా శంకుస్థాపన

పాటు మారుమూల గిరిజన గ్రామాల్లో కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేద రోగులు డయాలసిస్ చికిత్స కోసం ఖమ్మం, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనివల్ల ప్రయాణ, వైద్య ఖర్చులు భరించలేక రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భద్రాచలంలోనే డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తే ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కిడ్నీ వైద్య నిపుణుల పర్యవేక్షణలో సాధారణ రుసుముతో చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన పేదలు, గిరిజన కుటుంబాలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కిడ్నీలు పూర్తిస్థాయిలో పనిచేయని రోగులకు డయాలసిస్ ప్రాణాధారమైన చికిత్స అని, వైద్యుల సూచన మేరకు వారానికి రెండు లేదా మూడు సార్లు చికిత్స చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. స్థానికంగానే ఈ సేవలు అందుబాటులోకి వస్తే రోగులకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు నిరంతర చికిత్స పొందేందుకు వీలవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



బాల ఉగ్ర నరసింహ స్వామి భక్తి గీతాల పాటల సీడీ ఆవిష్కరణ

హుజూర్ నగర్ టౌన్ నవంబర్ 16 (జనంసాక్షి):

సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలో గల ఎర్రవరం గ్రామంలో దూలగుట్ట పై వెలిసిన శ్రీ బాల ఉగ్రనరసింహస్వామి వైభవాన్ని కీర్తిస్తూ రచయిత శ్రీ ఆవుల వీరభద్రం రచించిన భక్తి గీతాన్ని గాయకులు తంగేళ్ల ఆనంద్ బాబు గానం చేసిన ధన ధన ధన ధన దరువులు వేయంగా... ఘన ఘన ఘన ఘన గంటలు మ్రోగంగా అంటూ పాడిన భక్తి గీతాల సీ డీ ని సోమవారం పట్టణంలోని స్థానిక శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో శ్రీ అన్నమయ్య భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షులు బాచిమంచి కొండయ్య , ప్రధాన గాయకులు చప్పిడి బిక్షం, కన్వీనర్ ఆకుల రాము చేతుల మీదుగా ఆవిష్కరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో గాయకులు తంగేళ్ల ఆనంద్ బాబు బృందం సభ్యులు ఉప్పల వీరభద్రం, ఆకుల రజని, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

పట్టువస్త్రాలంకరణ వేడుకలో చిన్నారులను ఆశీర్వదించిన నేతి విద్యాసాగర్, దైద రవీందర్

చిట్యాల, నవంబర్ 16 (జనంసాక్షి):

చిట్యాల మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ఎడ్ల శ్రీశైలం యాదవ్ – మంజుల దంపతుల కుమార్తెలు, కుమారుడి పట్టువస్త్రాలంకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర మాజీ శాసనమండలి ఛైర్మన్ నేతి విద్యాసాగర్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ హాజరై చిన్నారులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిన్న తుమ్మలగూడెం సర్పంచ్ మహేష్ యాదవ్, చిట్యాల కాంగ్రెస్ నాయకులు జగిని భిక్షం రెడ్డి, పావురాల మత్స్యగిరి యాదవ్, సోమనబోయిన శ్రీశైలం యాదవ్, ఎడ్ల మహాలింగం యాదవ్, పాలకుల పరమేశ్ యాదవ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ వారిచే కార్డెన్ సెర్చ్ ప్రోగ్రాం

అశ్వరావుపేట నవంబర్ 16 (జనంసాక్షి):
ఈరోజు అశ్వారావుపేట పోలీసుల ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల ప్రకారం, పాల్వంచసబ్ డివిజనల్ ఆఫీసర్ సతీష్ కుమార్ సూచన మేరకు,అశ్వరావుపేట మండలంలో గల వడ్డెరంగాపురం గ్రామం నందు కార్డెన్ సెర్చ్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్డెన్ సెర్చ్ ప్రోగ్రాంలో మొత్తం 91 ఇళ్లను సోదా చేయడం జరిగింది, అలాగే ఆ గ్రామంలో గల 83 ద్విచక్ర వాహనాలు మరియు 11 ఆటోలు మరియు ఆరు ట్రాక్టర్లు వాటి యొక్క వాహన పత్రాలు పరిశీలించిన తర్వాత 15 ద్విచక్ర వాహనాలు యొక్క పత్రాలు సరిగ్గా లేకపోవడం వల్ల వాటిపై చలాన్ విధించి వాటిని అప్పటికప్పుడే చలాన్ ను కట్టించడం జరిగింది. అలాగే సరైన ధ్రువపత్రాలు చూపించని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగింది. అలాగే గ్రామస్తులు అందరికీ కూడా రాబోవు సంక్రాంతి పండగ ను పురస్కరించుకొని ఎవరూ కూడా గ్రామంలో కోడిపందాలు, పేకాటకు సంబంధించిన జూద శిబిరాలు నిర్వహించడం కానీ వాటిలో పాల్గొనడం గాని చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. అలాగే గంజాయి, సైబర్ క్రైమ్ వంటి నేరాలు చేయకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేయడం జరిగింది. అలాగే మైనర్ డ్రైవింగ్ చేయకుండా ఉండడానికి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. అశ్వరావుపేట మండల ప్రజలందరికీ అశ్వరావుపేట పోలీసు వారు తెలియజేయునది ఏమనగా రాబోయే సంక్రాంతి పండగ కొత్త సంవత్సరం పురస్కరించుకొని ఎవరన్నా కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహించిన వాటిలో పాల్గొన్నట్లయితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు వారి తరపున హెచ్చరించడం జరుగుతుంది. అశ్వరావుపేట మండలంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండడానికే?, ముఖ్యంగా గంజాయి యొక్క రవాణా వాడకం వంటి వాటిపై నిగా పెట్టి యొక్క చర్యలను ఉక్కుపాదంతో అణచటానికి పోలీసు వారు నిత్యం ఈ విధంగా అన్ని గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ,చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది.





ఈ యొక్క కార్యక్రమంలో అశ్వరావుపేట సిఐ నాగరాజు రెడ్డి, అశ్వరావుపేట ఎస్ హెచ్ ఓ సాయి కిషోర్ రెడ్డి, అదనపు ఎస్ఐ దేవ్ సింగ్, దమ్మపేట అదనపు ఎస్ఐ బాలస్వామి, అశ్వరావుపేట సర్కిల్ పోలీస్ సిబ్బంది, వడ్డరంగాపురం సర్పంచ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మైనర్ బాలుడి దుర్మరణం

పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు తప్పవు

ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి

పలిగొండ, నవంబర్ 16 (జనంసాక్షి)
సుంకిశాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పులిగిల్లకు చెందిన మైనర్ బాలుడు మృతి చెందాడు. పాఠశాల నుంచి స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో బాలుడు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. కారు అతివేగం, అజాగ్రత్తగా వ్యతిరేక దిశలో రావడంతో ప్రమాదం జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు. మృతుడి తల్లి ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణమయ్యే తల్లిదండ్రులు, వాహన యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి మైనర్లను వాహనాలకు దూరంగా ఉంచాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

నల్లగొండ వన్‌టౌన్ సీఐగా క్రాంతి కుమార్ బాధ్యతల స్వీకరణ



నల్లగొండ,నవంబర్ 16,(జనంసాక్షి):
నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా క్రాంతి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి నుంచి నల్లగొండకు బదిలీపై వచ్చిన ఆయన వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.గతంలో నల్లగొండ, మిర్యాలగూడ ప్రాంతాల్లో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయనకు ఈ ప్రాంతంపై గత అనుభవం ఉంది.ఈ సందర్భంగా సీఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గంజాయి విక్రయాలు, అక్రమ దందాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే డయల్ 112కు ఫోన్ చేయాలని లేదా నేరుగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.



వైభవంగా శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

సతీసమేతంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

ఆలయానికి ఎమ్మెల్యే మరో రూ.10 లక్షల విరాళం

చండూరు, నవంబర్ 16 (జనంసాక్షి)
చండూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వైభవం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన సతీమణి లక్ష్మితో కలిసి హాజరై యంత్ర, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట మహాక్రతువుల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప దీక్షలో ఉన్న ఎమ్మెల్యే దంపతులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొనడం భక్తులను ఆకట్టుకుంది.అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం తుది దశకు చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి అహర్నిశలు కృషి చేస్తున్న కమిటీ సభ్యులు, సహకరిస్తున్న భక్తులు, దాతలను అభినందించారు. ఇప్పటికే తన వంతుగా రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించానని, తాజాగా మరో రూ.10 లక్షల విరాళం ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ఆలయ నిర్మాణానికి మొత్తం రూ.30 లక్షల సహాయం అందించనున్నట్లు తెలిపారు. భగవంతుడు ప్రసాదించిన స్థాయికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములై తమవంతు విరాళాలు అందించాలని పిలుపు నిచ్చారు. ఈ పవిత్ర కార్యానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.దేవుడు కొందరివాడు కాదని, సమస్త మానవాళికి చెందినవాడని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భగవంతుడి సన్నిధిలో కులమతాలు, రాజకీయాలకు ఎలాంటి స్థానం లేదని, భక్తికి భేదభావాలు ఉండవని పేర్కొన్నారు. దైవభక్తి ప్రతి ఒక్కరినీ ఐక్యంగా నిలబెడుతుందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తి, ఐక్యత, సేవాభావానికి ప్రతీకగా నిలిచే అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. చండూరు పట్టణంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేలా ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.

రూ.2లక్షల విలువ చేసే వెండి కుంభహారతి బహూకరణ

జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి):



అర్వపల్లిలోని ప్రసిద్ధ శ్రీ యోగానంద లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయానికి జాజిరెడ్డిగూడెం గ్రామ వాసి ఈ దేవాలయ మొట్ట మొదటి చైర్మన్‌గా పనిచేసిన రామరాజు ప్రభాకరరావు తన తండ్రి రామచందర్ రావు జ్ఞాపకార్థం సోమవారం రూ.2లక్షల విలువచేసే వెండి కుంభహారతిని ఆలయానికి బహూకరించారు. ఈ సందర్భంగా కుంభహారతికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది రామరాజు శ్యాంసుందర్ రావు, అర్చకులు అర్వపల్లి రాంబాబు, పవన్‌కుమార్, ప్రభాకరరావు కుటుంబీకులు, భక్తులు పాల్గొన్నారు.

నూతనంగా సూర్యాపేట నుంచి తుంగతుర్తికి బస్సు



జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి):
సూర్యాపేట నుండి అర్వపల్లి మీదుగా తుంగతుర్తి మండల కేంద్రానికి రాత్రి వేళలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీస్ ప్రారంభమైంది. నైట్ హాల్ట్ ఈ బస్సు సర్వీస్ ప్రతి రోజు రాత్రి సూర్యాపేట కొత్తబస్టాండ్ నుండి రాత్రి 8 గంటలకు బయలుదేరి తిమ్మాపురం, అర్వపల్లి, వెలుగుపల్లిల మీదుగా తుంగతుర్తికి 9 గంటలకు చేరుకుంటుంది.ఈ బస్సు మరుసటి రోజు ఉదయం 5 గంటలకు అక్కడి నుండి తిరిగి ఇదే రూట్లో 6.10 గంటలకు సూర్యాపేటకు చేరుకుంటుంది. ఆదివారం రాత్రి మొదలైన ఈ బస్సు సర్వీస్ తుంగతుర్తిలో నైట్ హాల్ట్ చేసి సోమవారం ఉదయం అర్వపల్లి మీదుగా వెళ్ళింది. ఈ బస్సును ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట (జనంసాక్షి):
ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం, కుడకుడలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు ఎల్గూరి ఇందిరా వీరయ్య గౌడ్, సైదులు,డిఎంసి రమేష్ నాయక్, టిఎంసి వసంత్ కుమార్, ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వినోద, జ్యోతి, సునిత, గౌతమి, మంగమ్మ, ధనమ్మ, కవిత సంధ్యారాణి,నాగమణి, ఆర్పీలు శిరీష, ఫణిమా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎవరు చెప్పినా మేము మారం గాక మారం

మా స్టైల్ అంతే..

కలెక్టర్,ఎంపీడీవో ఆదేశాలు 'బేఖాతరు'..



- ○సీఎం ప్రజావాణికి కీలక శాఖల అధికారుల డుమ్మా!
- ○ రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్న ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు
- ○ రేవంత్ ప్రభుత్వం పై విశ్వాసం కోల్పోతున్న గ్రామ ప్రజలు ఎక్కడి సమస్య అక్కడే పేపర్లకే పరిమితం
- ○సమయం-11 దాటినా ఖాళీ కుర్చీలే దర్శనం-నిర్లక్ష్యపు నీడలో 'ప్రజావాణి'..
- అర్జీదారుల ఆగ్రహం

కామేపల్లి, నవంబరు16 (జనంసాక్షి):
ఎవరు చెప్పినా మేము మారం గాక మారం... మా జిల్లాస్థాయి అధికారులు కావచ్చు... మండల స్థాయి అధికారులు కావచ్చు... మా స్టైలే అంతే... అన్న చందంగా తయారయింది మండలంలోని కీలక శాఖల అధికారుల వ్యవహారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'సీఎం ప్రజావాణి' ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించిన సీఎం ఈ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు అపహాస్యం చేస్తున్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా, గైర్హాజరైతే వేటు తప్పదని ఎంపీడీవో ధరావత్ సోమ్‌లాల్ కఠిన హెచ్చరికలు జారీ చేసినా మండలంలోని వివిధ శాఖల అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు. ?సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణికి 11 గంటలు దాటినా పలు కీలక శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కాలేదు. జాబితాలో పేరున్న బాధ్యతాయుతమైన అధికారులు స్వయంగా హాజరై రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కారు.ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు మొత్తం 24 మంది హాజరు కావలసి ఉండగా కేవలం 7 మంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు గైరాజర్ అయ్యారు.వివిధ సమస్యలపై తమ గోడు వెల్లబోసుకుందామని ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని వచ్చిన అర్జీదారులు అధికారుల కోసం గంటల తరబడి వేచి చూశారు. దీంతో వారు ఖాళీ కుర్చీలను చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గైరాజర్ కావటం తో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడుతున్నారు.ప్రధాన శాఖలైన రెవిన్యూ, అగ్రికల్చర్, విద్యాశాఖ అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు.వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, ఎక్సైజ్,ఆర్ అండ్ బి, ఐ టి డి ఏ హార్టికల్చర్, మత్స్య శాఖ అధికారులు అసలు అడ్రస్ లేరు.మరికొందరు అధికారులు ఈ సమావేశానికి తమ సొంత పనులు ముగించుకొని తీరిక చూసుకొని ఆలస్యంగా హాజరు కావటం తాము గ్రామాల్లో విజిట్ కు వెళ్ళామని అందుకే ఆలస్యం అయిందని చెప్పటం ఒక కోస మెరుపు ఇప్పుడు వరకు జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి అందరు మండల స్థాయి అధికారులు ఒక్కసారి కూడా సమావేశానికి హాజరైన దాఖలాలు లేవు. కొన్ని శాఖల అధికారులు వస్తే కొన్ని శాఖల అధికారులు అసలు అడ్రస్ ఉండటం లేదు. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెట్టుకున్న ఉన్నత లక్ష్యం నీరు గారి పోతుంది జిల్లా ఉన్నతాధికారుల హెచ్చరిక లనే లెక్కచేయని ఈ 'దుమ్మా' అధికారులపై జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. అనే కోణంలో ప్రజలు ఎదురుచూస్తున్నారు.



మాజీ సర్పంచ్ పంది శ్రీను సేవలు చిరస్మరణీయం

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

కొండమల్లేపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి):



కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత స్వర్గీయ పంది శ్రీను కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామంలో స్వర్గీయ పంది శ్రీను మరణించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంది శ్రీను విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ పంది శ్రీను గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడని కొనియాడారు.ఆయన ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పంది శ్రీను కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎం.ఏ. సిరాజ్ ఖాన్, నాయిని మాధవరెడ్డి, దూదిపాల వేణుధర్ రెడ్డి, దూదిపాల శ్రీధర్ రెడ్డి, ఊట్కూరి వేమన్ రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, తేరా సత్యనారాయణ రెడ్డి, తిప్పర్తి రుక్మారెడ్డి, సర్పంచులు పసునూరి యుగేందర్ రెడ్డి, రమావత్ మోతిలాల్, రామకృష్ణ, రామావత్ రవి నాయక్, ఎర్ర కృష్ణ, బొడ్డుపల్లి సైదులు, ఇస్లావత్ శంకర్ నాయక్, ఆదిరాల రాములు, గడ్డం శ్రీరాములు, సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉపసర్పంచులకు చోటేది

ఉపసర్పంచులకు గుర్తింపు కల్పించాలి : మేకల కోటిరెడ్డి

గుర్రంపోడు: నవంబర్ 16 (జనంసాక్షి)



గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై సర్పంచులతో పాటు ఉపసర్పంచుల పేర్లను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని గుర్రంపోడు మండల ఉపసర్పంచుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారికి (ఎంపీడీవో) వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఫోరం మండల అధ్యక్షుడు మేకల కోటిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులతో సమానంగా ఉపసర్పంచులు సైతం కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపసర్పంచులకు ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలాఫలకాలపై పేర్లు లేకపోవడం బాధాకరమన్నారు. ఉపసర్పంచులకు కూడా తగిన గుర్తింపు కల్పించాలని కోరారు. అదేవిధంగా సర్పంచులకు అందిస్తున్న విధంగానే ఉపసర్పంచులకు సైతం ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఫోరం కోశాధికారి, జువ్విగూడెం ఉపసర్పంచ్ పాల్వాయి ఏడుకొండలు, సుల్తాన్‌పురం ఉపసర్పంచ్ అందుగుల గణేష్, కాల్వపల్లి ఉపసర్పంచ్ బొంత దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక సోమవారం పూజలు



సూర్యాపేట (జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో గల శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటి సోమవారం సందర్భంగా స్వామివారికి 108 రకాల ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు.ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ శర్మ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 9న ప్రారంభమైన కార్తీక మాస ఉత్సవాలు డిసెంబర్ 8 వరకు కొనసాగుతాయని తెలిపారు.30 రోజులపాటు స్వామివారికి 30 ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య,ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, డాక్టర్ అనంతుల అనూష, రాజయ్య, వాసుదేవరావు, వెంకన్న, ప్రభాకర్, కృష్ణ, ఉపేందర్ రావు, సత్యంబాబు, తోట శ్యామ్ ప్రసాద్, శంకర్, అర్చకులు దుర్గాప్రసాద్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా భరోసా

హ లియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

హాలియా నవంబర్ 16 జనంసాక్షి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో హాలియా మున్సిపాలిటీ లో ప్రతి కుటుంబం తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి పిలుపునిచ్చారు ఈనెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ పథకం నమోదు ప్రక్రియను అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి ఐదు లక్షల జీవితబీమా సౌకర్యం కల్పిస్తూ దేశంలోనే ఈ విధానాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించబోతుంది అని అన్నారు కుటుంబానికి ఆధారమైన వ్యక్తి అకాల మరణం చెందుతే ఆ కుటుంబం ఆర్థికంగా చితికి పోకూడదని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఈ చారాత్రికగా నిర్ణయం తీసుకుందానే కొనియాడారు హాలియా మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని తీసుకొని ప్రతి ఒక్క కుటుంబం పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

కనగల్లు ఎస్సైగా ఎం లక్ష్మయ్య బాధ్యతలు స్వీకరణ

కనగల్లు, నవంబర్ 15 (జనంసాక్షి)



కనగల్ ఎస్సైగా ఎంలక్ష్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన కె రాజీవ్ రెడ్డిని విఆర్ కు బదిలీ చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మయ్య మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పోలీస్ స్టేషన్కు సమస్యలపై వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి వారి ఫిర్యాదులను సాధ్యసాధ్యాల మేరకు పరిష్కారం చూపుతానని ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు మోటివేషనల్ కార్యక్రమం

చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలి :వక్తల పిలుపు



కల్లూరు నవంబర్ 16(జనంసాక్షి)
తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా వారి జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు అన్నారు.కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని జీడీబీ పల్లి (బోడిమెల్లి) గ్రామానికి చెందిన కీ.శే. సంఘం శంభయ్య – తిరుపతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సంఘం మల్లయ్య, భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్, టీజీవోస్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు లయన్ సంఘం వెంకట పుల్లయ్య, సంఘం మల్లయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మోట ివేషనల్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సత్తుపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పంజాల. సర్వయ్య ముఖ్య అతిథిగా, ప్రముఖ సాఫ్ట్ స్కిల్స్ ఉ లైఫ్ స్కిల్స్ ట్రైనర్ జవ్వాది వెంకటేశ్వర బాబు ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ముఖ్య అతిథి సీఐ పి. సర్వయ్య మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు . అమ్మాయిల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు..డ్రగ్స్, ఫోక్సో వంటి కేసుల్లో చిక్కుకుంటే పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ప్రతికూల వివరాలు నమోదయ్యే అవకాశం ఉందని, తద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు, సాఫ్ట్వేర్ ఉద్యోగాలు, పాస్పోర్ట్ పొందే విషయంలో ఇబ్బందులు ఎదురుకావచ్చని హెచ్చరిస్తూ విద్యార్థులు తమ భవిష్యత్తును జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. నిర్వాహకులు సంఘం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని, వారిపట్ల ప్రేమాభిమానాలు, గౌరవ మర్యాదలతో వ్యవహరిస్తూ వారి ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. తన తల్లి సంఘం తిరుపతమ్మ వర్ధంతి నవంబర్ 17 సందర్భంగా, తల్లిదండ్రులు శంభయ్య – తిరుపతమ్మ దంపతుల జ్ఞాపకార్థం తాను చదువుకున్న కళాశాల విద్యార్థులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చెడు సాహచర్యాలు, వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు.మోటివేషనల్ ట్రైనర్ జవ్వాది వెంకటేశ్వర బాబు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, లక్ష్యాలను నిర్దేశించుకోవడం, తల్లిదండ్రులు, గురువుల మార్గదర్శకత్వాన్ని పాటించడం, మంచి అలవాట్లు అలవరచుకోవడం ద్వారా జీవితంలో విజయం సాధించవచ్చని వివరించారు. కౌమార దశలో వచ్చే శారీరక, మానసిక మార్పులు, చెడు వ్యసనాల ప్రభావాలను ఉదాహరణలతో వివరిస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. విజయానికి అడ్డదారులు లేవని, కృషి, క్రమశిక్షణే విజయానికి మార్గాలని తెలిపారు.కల్లూరు ఎస్.ఐ. జె. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చెడు సాహచర్యాలకు దూరంగా ఉండి చట్టాలను గౌరవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాడిశెట్టి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులు!

ఎర్రగుంట పాఠశాలలో ఘనంగా స్వయం పాలన దినోత్సవం ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిన చిన్నారులు

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి)
మండల పరిధిలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా అవతారమెత్తి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అంతేకాకుండా పాఠశాలలోని వివిధ బాధ్యతలను చేపట్టి, ఉపాధ్యాయుల పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తూ పాఠశాల కార్యక్రమాలను కొనసాగించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులుగా, వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు స్వయం పాలన దినోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శంకర్ మహదేవన్, ఉపాధ్యాయులు సునందా రెడ్డి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి, బాబురావు, వెంకటేశ్వరరావు, బాలు, వసంత, సుశీల, పద్మ, మోతీలాల్, జయరాం, ప్రసాద్, పాఠశాల సిబ్బంది నాగేశ్వరరావు, శిరీష, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



ఆర్జేసీ కృష్ణకు కాపు జేఏసీ ఘన సన్మానం



ఖమ్మం, (జనంసాక్షి) :
ఖమ్మంలోని కాళ్ళ రామారావు మామిడి తోటలో మున్నూరు కాపు వన భోజనాలు అత్యంత వైభవంగా, వేలాది మంది సామాజిక వర్గీయుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని చరిత్రాత్మక రీతిలో విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎస్బీఐటీ, ఆర్జేసీ విద్యా సంస్థల చైర్మన్ గుండాల కృష్ణను మున్నూరు కాపు కాపు జేఏసీ నాయకులు సోమవారంఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కృష్ణ గారు మాట్లాడుతూ... "అందరం ఐక్యంగా ఉంటూ మన సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇలాంటి వన భోజనాల కార్యక్రమాలు కుటుంబాల మధ్య అనుబంధాలను పెంచడమే కాకుండా, మన ఐక్యతను చాటిచెబుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ, అలాగే తనను ఆదరించి సన్మానించిన కాపు జేఏసీ నాయకులకు కృష్ణ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మన సామాజిక వర్గ విద్యా, ఆర్థిక అభ్యున్నతికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మడూరి సైదారావు, జిల్లా అధ్యక్షులు యర్రా అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజా, జిల్లా యువజన అధ్యక్షులు మాటేటి రవి, నగర అధ్యక్షులు నరేష్ నాయుడు, నగర ఉపాధ్యక్షులు కొత్త రాజారామ్, నగర కార్యదర్శి వీసరి అంజయ్య తదితర ముఖ్య నాయకులు, పెద్ద ఎత్తున సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు

పది పంచాయతీల పరిధిలో 344 మందికి పింఛన్ మంజూరు పత్రాలు అందజేత

పింఛన్ల పంపిణీ నిరంతర ప్రక్రియ : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 16 (జనం సాక్షి):
ఎన్నో సంవత్సరాలుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత అందిస్తోందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో రాజేశ్వరి సమక్షంలో పది గ్రామ పంచాయతీల పరిధిలోని 344 మంది అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందుతాయని, పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అర్హులైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా నిలుస్తున్న జర్నలిస్టులకు ఘన సత్కారం

జాతీయ పత్రిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు



సంస్థాన్ నారాయణపురం. నవంబర్ 16. (జనంసాక్షి):
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని ప్రజల పక్షాన పని చేస్తూ నిజాని నీర్భయంగా రాస్తున్న పత్రిక విలేకరులకు జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పత్రిక విలేకరులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కరంతోత్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విలేకరులకు సత్కరించి పత్రిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా మాట్లాడుతూ అనంతరం ప్రజల పక్షాన, ప్రజల కోసం వార్తలను సమస్యలను పత్రికలో ప్రచురిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ముందుకు సాగుతున్న పత్రిక విలేకరులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మందుగుల బాలకృష్ణ కత్తుల లక్ష్మయ్య గుత్త శేఖర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డైరెక్టర్ మెగావత్ రెడ్డి నాయక్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ బిచ్చు నాయక్ కురుమిద్ద గోపాలు రాచకొండ జంగయ్య వడ్త్యా రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సమాజ నిర్మాణమే వాసవి క్లబ్స్ ధ్యేయం

❑ అంగరంగ వైభవంగా 'చారుగుళ్ల డిస్కాన్?2026' జిల్లా సదస్సు

❑ నూతన జిల్లా గవర్నర్‌గా ధారా మల్లికార్జునరావు ఎన్నిక

భద్రాచలం నవంబర్ 16 (జనంసాక్షి)

సేవా దృక్పథంతో సమాజంలోని పేద, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావడమే వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రధాన ధ్యేయమని డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ అన్నారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ106ఏ పదో వార్షిక జిల్లా సదస్సు 'చారుగుళ్ల డిస్కాన్?2026' ఆదివారం భద్రాచలంలోని సూపర్ బజార్ సెంటర్ శ్రీరామభద్ర నిలయం (రాజుల సత్రం)లో ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ భద్రాచలం ఆతిథ్యంలో జరిగిన ఈ సదస్సుకు డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, జిల్లా ప్రథమ మహిళ చారుగుళ్ల వాణి సీతారత్నకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ సెక్రటరీ (సర్వీస్ యాక్టివిటీస్) జూలూరి రమేష్‌బాబు, పరిశీలకుడిగా ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విట్టా దురయ్య, గౌరవ అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరయ్యారు.

- వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ వాసవి క్లబ్స్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. గత ఐదేళ్లుగా ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి పర్వదినాల్లో భద్రాచలానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఏటా 20 వేల వాటర్ బాటిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గోదావరి వరదల సమయంలో నిరాశ్రయులైన బాధితులకు అన్నదానం ద్వారా ఆహారం అందించి ఆదుకున్నారని గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సేవా కార్యక్రమాలు చేపట్టడంలో వాసవి క్లబ్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.





- సేవే జీవన విధానం కావాలి

డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సేవ అనేది కేవలం ఒక కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవన విధానంగా మారాలని ఆకాంక్షించారు. 'కలిసికట్టుగా పనిచేద్దాం' అనే స్ఫూర్తితో సమాజంలోని నిరుపేదలకు అండగా నిలవాలని సభ్యులకు పిలుపునిచ్చారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ 65 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్ధ వెంకట సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు సేవా పథకాలను ముఖ్య అతిథి జూలూరి రమేష్‌బాబు వివరించారు. వీకేఎస్సీ, స్వయం ఉపాధి, సరస్వతి విద్యానిధి, మహాప్రస్థానం, దివ్యాంగులకు వీల్‌చైర్లు, కృత్రిమ అవయవాల పంపిణీ, వాసవి స్వయంవరం, యువతకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ, శతమానం భవతి తదితర కార్యక్రమాలను వివరించారు. నూతన గవర్నర్‌గా ధారా మల్లికార్జునరావుసదస్సులో క్యాబినెట్ ట్రెజరర్ ఉడతా నగేష్‌కుమార్ వార్షిక బడ్జెట్ నివేదికను సమర్పించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లా సదస్సు పరిశీలకుడు విట్టా దురయ్య తన నివేదికను సమర్పిస్తూ జిల్లాలోని క్లబ్బులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఎన్నికల అధికారి కొత్త వెంకటేశ్వరరావు ఎన్నికల నివేదికను ప్రకటించి నూతన జిల్లా గవర్నర్‌గా ధారా మల్లికార్జునరావును అధికారికంగా ప్రకటించారు. అనంతరం ప్రస్తుత గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ నూతన గవర్నర్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేశారు.

- సేవా ప్రతిభకు పురస్కారాలు

జిల్లా పరిధిలో విశిష్ట సేవలు అందించిన క్లబ్బులు, సభ్యులకు పలు విభాగాల్లో అవార్డులు ప్రదానం చేశారు. ఎర్లీ బర్డ్, మ్యాన్ మైలేజ్, బెస్ట్ కపుల్, బెస్ట్ డ్రెస్డ్ వాసవియన్, బెస్ట్ డ్రెస్డ్ వాసవియన్ లేడీ, హయ్యెస్ట్ రిజిస్టర్డ్, బెస్ట్ స్క్రాప్‌బుక్, బెస్ట్ ఫొటో ఆల్బమ్, బెస్ట్ మామ్, బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్ తదితర పురస్కారాలతో ప్రతిభావంతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ అడ్మినిస్ట్రేషన్ చింతల వినోద్‌కుమార్, క్యాబినెట్ సెక్రటరీ సర్వీసెస్ రేపాక డి. రాజమనోహర్, క్యాబినెట్ ట్రెజరర్ ఉడతా నగేష్‌కుమార్, వైస్ గవర్నర్ కొత్త రమేష్, కాన్ఫరెన్స్ చైర్మన్, భద్రాచలం హోస్ట్ క్లబ్ అధ్యక్షుడు వనమా కిరణ్‌కుమార్, కో-చైర్మన్లు చారుగుళ్ల వెంకట నాగభూషణం, చారుగుళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అంతర్జాతీయ, జిల్లా స్థాయి బాధ్యులు, రీజియన్, జోన్ చైర్మన్లు, జిల్లా పరిధిలోని 47 క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, వాసవియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టేకులపల్లి గిరిజన కళాశాల బాలికల వసతి గృహ సమస్యలను పరిష్కరించాలి

పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె గణేష్



టేకులపల్లి, నవంబర్ 16(జనంసాక్షి):

టేకులపల్లి మండల కేంద్రంలోని గిరిజన కళాశాల బాలికల వసతి గృహ సమస్యలను ఐటిడిఏ అధికారులు తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జె గణేష్ కోరారు. వసతి గృహంలో పేరుకుపోయిన సమస్యలు, వార్డెన్ ద్వారా ఎదురవు తున్న ఇబ్బందులను పరిష్కరించా లని వసతి గృహ విద్యార్థినీలు సోమవారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో ఏపీఓని కలిసి వినతి పత్రం అందించారన్నారు. ఈ కార్యక్రమానికి పిడిఎస్ యు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, అదేవిధంగా విద్యార్థినీలు వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో విద్యార్థినీలతో కలిసి ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపడుతామని వారు తెలిపారు.

కార్తీక సోమవారం..
కాశీ విశ్వేశ్వర స్వామికి విశేష భస్మాభిషేకం



భద్రాచలం నవంబర్ 16 (జనంసాక్షి)

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తొలుత పంచామృతాభిషేకం నిర్వహించి, అనంతరం విశేషంగా భస్మాభిషేకం జరిపారు. స్వామివారి అభిషేక సేవను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.కార్తీక సోమవారం కావడంతో వేకువజాము నుంచే భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నదీతీరంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంతో పాటు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. వివిధ శివాలయాల్లోనూ భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో భద్రాచలంలోని ఆలయాలు, గోదావరి తీరం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

ఐజెయు-టిటియుడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా తేజావత్ వినోద్ కుమార్ ఎన్నిక

జిల్లాకు దక్కిన ప్రాతినిధ్యం.. జర్నలిస్టుల హర్షం



బూర్గంపహాడ్ నవంబర్ 16 (జనంసాక్షి)

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్-143) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ తేజావత్ వినోద్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు నవంబర్ 15న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గోర్ల బుచ్చన్న అధికారిక ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల జాబితాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వినోద్ కుమార్ పేరును ప్రకటించారు. జిల్లాలోని అంజనాపురం గ్రామానికి చెందిన వినోద్ కుమార్ ప్రస్తుతం 99 టీవీలో సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. అంతే కాకుండా తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పాత్రికేయుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించిన యూనియన్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికకు సహకరించిన యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్, తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు తిరుపతి నాయక్, భూక్య రవి నాయక్, టిటియుడబ్ల్యూజే (హెచ్-143) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాసరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. వినోద్ కుమార్ ఎన్నిక పట్ల జిల్లా జర్నలిస్టులు, సహచరులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కేఓసిలోని హెచ్డి ఓబీలో పాత కార్మికులకే పనులు కల్పించాలి

ఓబి మేనేజర్, పిఓకి వినతి పత్రం అందజేసిన జేఏసీ

టేకులపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి):

సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నూతనంగా ఓసి కాంట్రాక్టు పొందిన హెచ్డి, ఓబీ మేనేజర్ ఇరాన్ బట్, కే ఓ సి ప్రాజెక్టు అధికారి బింగి మాధవరావు లకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎస్ ఏ నబి, ఎండి రాసుద్దిన్, డి ప్రసాద్,షేక్ యాకుబ్ షావలి, పాయం వెంకన్న లుమాట్లాడుతూ గత ఓబి ఎల్ ఎస్ ఎన్ లో పనిచేసిన కార్మికులకు తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ కోరారు. వారు స్పందిస్తూ ఇప్పుడే కొత్తగా వచ్చాము కొంత పరిశీలన, కోల్ బెంచి డంపు యార్డులు పరిశీలన చేస్తున్నామన్నారు. డిసెంబర్లో పని ప్రారంభమవుతుందని, పరిశీలించి పాత వారికే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు.



డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష

భద్రాచలం నవంబరు 16 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 14 మందిని భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులను విచారించిన సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. రాందాస్ ఒకరికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. దీంతో నిందితుడిని జైలుకు తరలించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ పి. కేశవరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా, రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్‌కు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం ఎప్పుడు?

○హైకోర్టు ఆదేశాలు, కేకే కమిటీ నివేదిక ఉన్నా అమలులో జాప్యమెందుకు?

○ఉద్యమకారుల కన్నీళ్లు తుడవాలి : ఖమ్మం జిల్లా టీ జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్

తిరుమలాయపాలెం, నవంబర్ 15 (జనంసాక్షి):ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాలను, కుటుంబాలను సైతం పక్కనపెట్టి పోరాడిన ఉద్యమకారులకు నేటికీ సరైన గుర్తింపు, న్యాయం దక్కకపోవడం విచారకరమని ఖమ్మం జిల్లా టీ జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు పెన్షన్లు, ఇంటి స్థలాలు కల్పించాలని హై కోర్టు 2026 ఫిబ్రవరి 23న ఆదేశించినా, 264 రోజులు గడుస్తున్నా అమలులో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కేకే కమిటీ ఆగస్టు 30న నివేదిక సమర్పించినప్పటికీ, ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. కమిటీ వ్యవహారశైలిపై ఉద్యమకారులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా అర్హులను గుర్తించాలని కోరారు. ఉద్యమకారుల్లో చాలామంది వృద్ధాప్యంలోకి చేరుకున్నారని, మరికొందరు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా పెన్షన్లు, ఇంటి స్థలాల హామీలను తక్షణమే అమలు



చేసి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని మందడి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు.

అనాథ వృద్ధురాలికి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన అన్నం ఫౌండేషన్

ఖమ్మం, నవంబర్ 16 (జనంసాక్షి):

ఖమ్మం కరుణగిరి సమీపంలోని మదర్ తెరిసా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న కళ అనే వృద్ధురాలు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆమెకు అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ లేకపోవడంతో, దహన సంస్కారాలు పూర్తి చేయాలని కోరుతూ ఆశ్రమ నిర్వాహకులు ఖమ్మం నగరానికి చెందిన అన్నం ఫౌండేషన్‌కు లిఖితపూర్వక పత్రం ద్వారా మృతదేహాన్ని అప్పగించారు. స్పందించిన అన్నం ఫౌండేషన్ ప్రతినిధులు మృతదేహాన్ని ఆశ్రమం నుండి ఫౌండేషన్‌కు తరలించి, తెల్ల వస్త్రాలు, పూలు, పూలదండలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించి శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ తెరిసా ఆశ్రమ సిస్టర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి, అనాథలకు



అన్నం ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అన్నం శ్రీనివాసరావు, ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాపుల ఐక్యతే ప్రధాన ఎజెండా

వన సమారాధనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాల కృష్ణ

ఖమ్మం, (జనంసాక్షి) :

సామాజికంగా, రాజకీయంగా క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్న మున్నూరు కాపు కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా మున్నూరు కాపు సంక్షేమ సంఘం మనుగడ సాగిస్తోందని, ఇందుకు కాపుల ఐక్యతే ప్రధాన ఎజెండా అని తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాల కృష్ణ పేర్కొన్నారు. సంక్షేమ సంఘం, కాపు జేఏసీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు వన సమారాధనకు విచ్చేసి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో ప్రకటించారు. ఈక్రమంలో కాపుల ఐక్యత దిశగా కలిసి వచ్చే సానుకూల శక్తులను కలుపుకుని ముందుకు సాగాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. జిల్లాలో కాపు కులస్తులకు ఎలాంటి ఆపద వచ్చినా రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా ఆదుకోవడానికి, వెన్నుదన్నుగా నిలవడానికి సంక్షేమ సంఘం అనునిత్యం పని చేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణ దిశగా సభ్యత్వ నమోదు ప్రక్రియ, అన్ని నియోజకవర్గ స్థాయిల్లో కమిటీల ఏర్పాటుకు చర్యలు



తీసుకుంటున్నట్లు వివరించారు. కాపు కార్తీక వన సమారాధనకు అతిథులుగా విచ్చేసి విజయవంతం చేసిన ఏపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు, కాపు జేఏసీ చైర్మన్ చందు జనార్ధన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. అలాగే జిల్లాకి చెందిన కాపు నేతలు లక్కినేని రఘు, బచ్చు విజయ్ కుమార్, లక్కినేని సుధీర్, ఆకుల మూర్తి, పిన్ని కోటేశ్వరరావు, తోట కనకరావు, గుండా బ్రహ్మం, కనకం భద్రయ్య, ఎర్ర జ్ఞానేశ్, మాటేటి కిరణ్, ముగాల శ్రీను, పసుపులేటి శ్రీనివాసరావు, కోయలు వెంకన్న, సత్యనారాయణ, జేఏసీ నాయకులు బచ్చు మధు, మడూరి సైదారావు, రాపర్తి రాజా, నరాల నరేష్, మాటేటి రవి తదితరుల కృషిని మరువలేనని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ నిరంతర పోరాటం

○ రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వాలి.. లేదంటే రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి..

○ యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి.. నిరుద్యోగ యువతకు కరెంట్ అఫైర్స్ పుస్తకాల పంపిణీ..



భద్రాచలం నవంబర్ 16 (జనంసాక్షి)

నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ, వారి ఉద్యోగ సాధనకు సహకారం అందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్ రెడ్డి కరెంట్ అఫైర్స్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. లైబ్రరీలు, కోచింగ్ కేంద్రాల సందర్శనలో భాగంగా సోమవారం భద్రాచలం లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కరెంట్ అఫైర్స్ బిట్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, లేనిపక్షంలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేలా నిరుద్యోగ యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను విస్మరించి యువతను నిరాశకు గురిచేస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గతంలో నిరుద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ న్యాయపోరాటం కూడా చేసిందని, భవిష్యత్తులోనూ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. పోలీసు ఉద్యోగాల ఎంపికలో లాంగ్ జంప్ అర్హతను 3.8 మీటర్లుగా నిర్ణయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిబంధన కారణంగా అనేకమంది అభ్యర్థులు ఈవెంట్లలోనే అవకాశాలు కోల్పోతున్నారని, దీనిపై ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన మెగా డీఎస్సీ హామీని నిలబెట్టుకోవాలని, ఇప్పటికే పలుమార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహించినప్పటికీ పెద్ద సంఖ్యలో ఉద్యోగాలతో నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం నిరుద్యోగులను నిరాశకు గురిచేస్తోందన్నారు. గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో స్థానిక గిరిజన యువతకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 నియామకాలు, డీఎస్సీ క్రీడా కోటా ఎంపికల్లో చోటుచేసుకున్నాయని వస్తున్న అవకతవకల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులకు న్యాయం జరిగేలా పారదర్శక నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థుల ఆశయాలకు అండగా..

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు నాణ్యమైన అధ్యయన సామగ్రి అందించాలనే ఉద్దేశంతో కరెంట్ అఫైర్స్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని రాకేశ్ రెడ్డి తెలిపారు. ఒక ఉద్యోగం సాధించేందుకు విద్యార్థులు పడుతున్న శ్రమ, వారి కుటుంబాలు పెట్టుకున్న ఆశలు తమకు తెలుసన్నారు. పుస్తకాల పంపిణీతో పాటు నిరుద్యోగుల సమస్యలను తెలుసుకుంటూ, వారి డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మానే రామకృష్ణ, రాంప్రసాద్, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువమిత్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ మాతృ మూర్తి మృతి

టేకులపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి):



ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ మాతృ మూర్తి దుబాకుల నాగమ్మ సోమవారం అనారోగ్యంతో టేకులపల్లి మండలం అంజనేయపాలెం గ్రామంలో మరణించారు. వారి భౌతిక కాయంపై సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహా రావు, ఎ ఐ కె యం ఎస్ మండల కార్యదర్శి భూక్యా హర్జ,మండల నాయకులు నర్సింగ్, మాజీ సర్పంచ్ భూక్యా కిర్యా, అనంతోజు చంద్రాచారి, బానోతు పంతులు పూల మాలలు వేసి జోహార్లు తెలిపారు.ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి జే సీతారామయ్యా, అధ్యక్షుడు కొక్కు సారంగపాణి, నాయకులు కొప్పుల శ్రీనివాస్,బయ్యా వర ప్రసాద్, రాయండ్ల కోటిలింగము సందర్శించి నివాళులు అర్పించారు.అంత్యక్రియలు ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం బంధం పల్లిలో జరుగుతాయని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు.

కల్లూరు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పై తక్షణమేచర్యలు తీసుకోవాలి

కల్లూరు నవంబర్ 16(జనం సాక్షి)



కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అసభ్యంగా ప్రవర్తిస్తూ, అకారణంగా తాకుతూ వేధిస్తున్నారని అతనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని పలువురు విద్యార్థులు సోమవారం నేషనల్ హైవే ప్రధాన రహదారిపై ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ విద్యార్థునుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుతో భయాందోళనకు గురవుతున్నామని వాపోయారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి. బాధిత విద్యార్థుల వివరాలను గోప్యంగా ఉంచాలి. విద్యార్థులపైఎలాంటి బెదిరింపులు లేదా ఒత్తిళ్లు లేకుండా చూడాలి.విచారణ పూర్తయ్యే వరకు అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొంటూ అధికారులకు అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులుకె కె. భార్గవ్ఎ. రజని బి. భార్గవి బి. నిహారిక కె. అనూష . ఉహిత్, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం నేత కొమ్ము శ్రీనుకు పరామర్శ

తిరుమలాయపాలెం, (జనంసాక్షి):

మోటార్ బైక్ ప్రమాదంలో గాయపడి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న పాలేరు నియోజకవర్గం, తిరుమలాయపాలెం మండల సీపీఎం కార్యదర్శి కొమ్ము శ్రీనును తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ధరావత్ రాములు (రామన్న) పరామర్శించారు. సోమవారం శ్రీను నివాసానికి వెళ్లిన ఆయన, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కొమ్ము శ్రీను త్వరగా కోలుకుని, తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఎంపీ (ఐఖ) పార్టీ జిల్లా అధ్యక్షులు మట్టి ప్రసాద్, డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు దుంపల నవీన్ తదితరులు పాల్గొని శ్రీనుకు ధైర్యం చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం..

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 16 (జనంసాక్షి)

తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2026-27 సంవత్సరానికి గాను అర్హులైన క్రిస్టియన్ మైనారిటీలకు డ్రోన్ ఆపరేటర్ శిక్షణ, ఉపాధి కల్పించుట కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు క్రిస్టియన్ మైనారిటీ అయి ఉండటంతో పాటు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పట్టణ ప్రాంతాల వారైతే రూ. 2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల వారైతే రూ. 1.50 లక్షల లోపు వార్షిక ఆదాయ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని తెలిపారు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 21వ తేదీలోపు వి.వెంకటాయపాలెంలోని కలెక్టరేట్ రెండవ అంతస్తు, ఎస్-29లో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో గాని, లేదా గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా గణేష్ ప్లైవుడ్ పైన రెండవ అంతస్తులో గల సాయినాథ్ ఎడ్యుకేషనల్ద రూరల్‌డెవలప్‌మెంట్ సొసైటీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ లో గాని సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9704003002 మొబైల్ నంబరును సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తిరుమల నగర్ వాసులరోడ్డు కష్టాలకు పరిష్కారం

○గ్రావెల్ రోడ్డు మరమ్మతు పనులనుపర్యవేక్షించిన
○మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్

కల్లూరు నవంబర్ 16(జనంసాక్షి)

కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు, హిమాలయ రెస్టారెంట్ వెనుక భాగంలో ఉన్న తిరుమల నగర్ కాలనీవాసుల దీర్ఘకాలిక రహదారి సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ ప్రాంతంలో కనీసం మట్టి రోడ్డు కూడా లేకపోవడంతో, ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు స్థానిక కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరస్వామి, మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు.కౌన్సిలర్ విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ స్వయంగా రంగంలోకి దిగారు. స్థానిక కౌన్సిలర్‌తో కలిసి ఆయన దగ్గరుండి ట్రాక్టర్ల ద్వారా రహదారిపై మట్టి తోలించి, చదును చేసే పనులను పర్యవేక్షించారు. త్వరలోనే ఈ మట్టి రహదారిని పూర్తిస్థాయి సిమెంట్ రోడ్డుగా మారుస్తామని ఈ సందర్భంగా ఆయన తిరుమల నగర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు.తమ సమస్యపై తక్షణమే స్పందించి రోడ్డు పనులు చేపట్టడంపై తిరుమల నగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్‌కు, కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరస్వామికి కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



నేడు ఉద్యోగుల 'సామూహిక సెలవు'.. జిల్లా కేంద్రంలో భారీ 'ధర్మ దీక్ష'

- ○ ఉద్యోగ, ఉపాధ్యాయులంతా కదలిరండి
- ○ మేనిఫెస్టో హామీకి మూడేళ్లు.. ప్రభుత్వానికి విన్నపం
- ○ టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ పిలుపు

ఖమ్మం అర్బన్, నవంబర్ 16 (జనంసాక్షి):

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్న ప్రధాన డిమాండ్‌తో మంగళవారం (నవంబర్ 17) నిర్వహించే 'సామూహిక సెలవు' మరియు జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ (ఐడీఓసీ) ఎదురుగా గల ధర్నా చౌక్‌లో ఉదయం 10 గంటలకు జరిగే 'ధర్మ దీక్ష'ను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్ ఈయూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ పిలుపునిచ్చారు. 01-09-2004 మరియు ఆ తర్వాత నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ అన్ని శాఖలు, క్యాడర్లు, హోదాలకు అతీతంగా ఐక్యత చాటాలని కోరారు.

హామీ ఇచ్చి మూడేళ్లయింది..

2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవంబర్ 17న అధికార కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దుపై స్పష్టమైన హామీ ఇచ్చిందని శశిధర్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు సంవత్సరాల పాటు ఎంతో ఓపికతో ఎదురుచూశామని పేర్కొన్నారు. మేనిఫెస్టో విడుదల చేసి సరిగ్గా మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వానికి ఇచ్చిన మాటను గుర్తుచేస్తూ 'దయచేసి మా విజ్ఞప్తిని అమలు చేయండి' అనే నినాదంతో ఈ నిరసన చేపడుతున్నట్లు తెలిపారు.

సీపీఎస్‌తో తీవ్ర నష్టం.. ఓపీఎస్‌తోనే భద్రత

సీపీఎస్ విధానంలో వేతనం నుండి 10 శాతం ప్రాన్ ఖాతాకు, 1.5 శాతం ఈహెచ్ఎస్ కు కలిపి మొత్తం 11.5 శాతం కోత విధిస్తున్నా కనీస పెన్షన్ గ్యారెంటీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల భవిష్యత్తును షేర్ మార్కెట్ ఒడిదుడుకులకు వదిలేశారని, రాష్ట్రంలో ఇప్పటివరకు రిటైర్ అయిన 5,000 మందికి పైగా ఉద్యోగులకు నెలకు రూ. 5,000 కూడా పెన్షన్ రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పదవీ విరమణ తర్వాత 'పెన్షనర్ ఐడి' లేక హెల్త్ కార్డుల ద్వారా వైద్యం అందడం లేదని, ఇటీవల ప్రకటించిన డీపీ ఏరియర్స్ కేవలం ఓపీఎస్ ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లోనే జమ చేసి సీపీఎస్ ఉద్యోగులకు అన్యాయం చేశారని విమర్శించారు. అదే ఓపీఎస్ విధానంలో అయితే చివరి వేతనంలో సగం (50%) జీవితాంతం పెన్షన్ గ్యారెంటీతో పాటు, డీఏ, పీఆర్సీ ప్రయోజనాలు, రిటైర్మెంట్ తర్వాత పూర్తిస్థాయి వైద్య, సామాజిక భద్రత లభిస్తాయని వివరించారు.



నేటి ధర్మ దీక్షకు భారీగా తరలిరండి

రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షలకు పైగా ఉద్యోగులు నవంబర్ 17వ తేదీకి సెలవు దరఖాస్తులను నమోదు చేసుకున్నారని శశిధర్ వెల్లడించారు. ఖమ్మం జిల్లాలోని అత్యవసర సేవల విభాగాలు మినహా అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి, ఉదయం 10 గంటలకు ఐడీఓసీ ఎదుట ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్మ దీక్షకు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ ఆకాంక్షను ప్రభుత్వానికి బలంగా చాటిచెప్పాలని జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.

వీవో భవన నిర్మాణ స్థలం మార్చాలని ప్రజల వినతి

కామేపల్లి, నవంబర్16 (జనంసాక్షి):

కామేపల్లి మండల లోని రుక్మితండా గ్రామ పంచాయతీ పరిధిలోని మహిళా సమాఖ్య వీవో బిల్డింగ్ నిర్మాణ స్థలాన్ని మార్చాలని కోరుతూ బండిపాడు, రాయిగూడెం గ్రామ ప్రజలు గుగులోత్ రవి నాయక్ కామేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. మహిళా సమాఖ్య భవన నిర్మాణ నిమిత్తం గతంలో బండిపాడు హ్యాబిటేషన్‌లోని కూలిపోయే స్థితిలో ఉన్న అంగన్‌వాడీ-1 స్థలాన్ని ఎంపిక చేసి,జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపడం జరిగిందని వారు పేర్కొన్నారు. అయితే ఈప్రతి పాదనను పరీశీలించి మంజురు చేయకపోవటం వలన రాయిగూడెం హ్యాబిటేషన్‌లో ఉన్న తిరుపతమ్మ తల్లీ గుడి పక్కన కొండాయిగూడెం చెరువు శిఖం స్థలానికి ప్రక్కనే కేటాయించాలని గ్రామస్తులు కోరారు.స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ భూమిని కేటాయించి భవన నిర్మాణం చేపట్టాలని వారు అధికారులను అభ్యర్థించారు.

ప్రజావాణి లో ప్రజల ఫిర్యాదు బండిపాడుకు బదులుగా కొండాయిగూడెం రెవిన్యూలో ప్రభుత్వస్థలం కేటాయించాలని ప్రజల విజ్ఞప్తి



సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?

నాణ్యత లేని సరుకులకు సెంట్రల్ టెండర్లే కారణం.. తక్షణమే రద్దు చేయాలి

ఖమ్మం, నవంబర్ 16, (జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. సెంట్రల్ టెండర్ విధానంలో సరఫరా అవుతున్న సరుకుల నాణ్యత, నిల్వల నిర్వహణలో లోపాలు విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సెంట్రల్ టెండర్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, జిల్లా స్థాయిలో స్థానిక ఏజెన్సీలకు టెండర్లు కేటాయించాలని డిమాండ్ చేసింది. నెలకు అవసరమైన సరుకులను ఒకేసారి కాకుండా విడతల వారీగా సరఫరా చేయాలని, అధికారులు నిరంతరం నాణ్యతను తనిఖీ చేయాలని కోరింది. పేద విద్యార్థుల ఆకలి, ఆరోగ్యంతో ప్రభుత్వం ప్రయోగాలు చేయడం తగదని, నాణ్యత లేని సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. ఈ సమస్యపై త్వరలోనే రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు కూరెల్ల మహేష్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ - వరంగల్ జోన్ ఇన్‌చార్జ్ దామాల సత్యం సత్యం తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ బాధ్యత.. అది వారి హక్కు. సెంట్రల్ టెండర్ విధానాన్ని రద్దు చేసి స్థానిక సరఫరా వ్యవస్థను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.



అర్హులైన వారికి పెన్షన్ లు ఇవ్వకపోతే ఆందోళన

అర్హులైన వారికి వెంటనే పెన్షన్ లు ఇవ్వాలని కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన



ఖమ్మం, (జనంసాక్షి) :

ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని అర్హులైన వారికి అధికారులు ఎంక్వైరీ చేసి వెంటనే పెన్షన్ లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా ధర్నా నిర్వహించారు . ఈ నిరసన కార్యక్రమానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భుక్యా శ్రీనివాసురావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ ఖమ్మం డివిజన్ పరిధిలోని 60 డివిజన్స్ లలో, మరియు రఘునాథ పాలెం మండలంలో పెన్షన్ లు పొందటానికి వందల సంఖ్యలో అర్హత వున్నప్పటికీ పేదలకు తాజా పెన్షన్ జాబితాలో వారి పేర్లు లేవు అని ఆందోళన వ్యక్తం చేశారు. వితంతువు లకు పెన్షన్ లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసింది అని కానీ ఆచరణలో ఇంకా వందల సంఖ్యలో వితంతువు లను ఎంపిక చేయలేదు అని విమర్శించారు. 57 సంవత్సరాలలు నిండిన వృద్ధాప్య పెన్షన్ లు గురించి అధికారులు ఏమి సమాధానం చెప్పడం లేదు అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఖమ్మం అసెంబ్లీ పరిధిలో కొద్దిమంది కి మాత్రమే పెన్షన్ లు మంజూరు చేసింది అని, కానీ ప్రతి డివిజన్ లో పెద్ద సంఖ్యలో అర్హత వున్న పేదలకు పెన్షన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వెంటనే అర్హత వున్న వారికి పెన్షన్ లు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మూడు సంవత్సరాల తర్వాత కొద్దిమంది కి మాత్రమే పెన్షన్ లు ఇచ్చి చేతులు దులుపుకుంటే ప్రజల ఆగ్రహాన్ని చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది అని హెచ్చరించారు. పెన్షన్ 2 వేలు నుంచి 3 వేలు పెంచుతాం అని చెప్పిన హామీ కూడా అమలు కాలేదు అని విమర్శించారు. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో పేద ప్రజలు పెన్షన్ లు కోసం కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా పెన్షన్ లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి డివిజన్ లో అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి కొత్త పెన్షన్ దారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అర్హత వున్న వారికి పెన్షన్ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.అనంతరం కమిషనర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మరోసారి అధికారులను పంపించి అర్హత వున్న వారికి పెన్షన్ లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి విష్ణు , ఓం జబ్బార్, దొంగల తిరుపతిరావు, ఎస్ నవీన్ రెడ్డి, జెల్లా ఉపేంద్ర, ఖాఐ నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, మాజీ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, షేక్ బేగం తదితరులు పాల్గొన్నారు.



టీఎస్‌యూటీఎఫ్ గురుకుల విభాగం

ఉపాధ్యక్షులుగా అన్నదమ్ములకు అవకాశం

ఖమ్మం, (జనంసాక్షి):

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (టీఎస్‌యూటీఎఫ్) గురుకుల విభాగంలో అన్నదమ్ములైన ఇద్దరు ఉపాధ్యాయులకు ఉపాధ్యక్షులుగా అవకాశం లభించడం విశేషంగా నిలిచింది. కొణిజర్ల మైనార్టీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న జి. క్రాంతి కుమార్, రఘునాధపాలెం మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న జి. ప్రవీణ్ గురుకుల విభాగం ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టడం పట్ల ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఇద్దరూ ఉపాధ్యాయ ఉద్యమంలో చురుగ్గా భాగస్వాములై, ఒకే సంఘంలో కీలక బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని పలువురు ఉపాధ్యాయ నాయకులు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, గురుకుల ఉద్యోగుల హక్కుల సాధన, విద్యారంగ అభివృద్ధి కోసం వీరిద్దరూ సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జి. క్రాంతి కుమార్, జి. ప్రవీణ్‌లకు సంఘం నాయకులు, గురుకుల ఉపాధ్యాయులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రత్యేక మోటివేషన్ క్లాస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 16 (జనంసాక్షి)

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజీ లెక్చరర్ మరియు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ నిపుణులు తాళ్లూరి సృజన్ కుమార్× పాల్గొని గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఆూఅ, ూఎ, కానిస్టేబుల్ తదితర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్, పరీక్షా విధానం, ప్రిపరేషన్, ప్రాక్టీస్, ప్రజెంటేషన్ మరియు సమయ నిర్వహణ వంటి అంశాలపై యువతకు విలువైన సూచనలు, దిశానిర్దేశం చేశారు.ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తగినంత నిద్ర, పౌష్టికాహారం, వ్యాయామం మరియు మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని వివరించారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం, నిపుణుల సూచనలు అందించాలనే లక్ష్యంతో ఇటువంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతకు అవసరమైన పఠన వాతావరణం, గ్రంథాలయ సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ప్రభుత్వ ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ సిహెచ్. మాల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, కార్యాలయ సిబ్బంది మరియు సుమారు 400 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్ వాసుల గోడు పట్టదా?

○ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్ల కోసం పేదల ఎదురుచూపులు

○8వ డివిజన్ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు బిఆర్ఎస్ నేతల వినతి

○అర్హులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్న భూక్యా అశోక్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 16 (జనంసాక్షి): 'నిరుపేదలు నివాసముంటున్న కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనలో ఎందుకింత జాప్యం? ఇంటి నంబర్లు, కరెంటు మీటర్లు లేక పేద కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా?' అంటూ బిఆర్ఎస్ నాయకులు మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం బిఆర్ఎస్ నాయకుడు భూక్యా అశోక్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

సాంకేతిక అడ్డంకులు తొలగించాలి

డివిజన్‌లోని వైఎస్సార్ నగర్ కాలనీ వాసులు ఇళ్లకు సంబంధించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేతలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి నంబర్ల కేటాయింపు, నూతన విద్యుత్ మీటర్ల ఏర్పాటుతో పాటు హౌసింగ్, ప్రాపర్టీ ట్యాక్స్ అంశాల్లో నెలకొన్న అడ్డంకులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. నిబంధనల పేరుతో పేదలను ఇబ్బంది పెట్టకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకుడు భూక్యా అశోక్ మాట్లాడుతూ.. 8వ డివిజన్ ప్రజల కష్టాలను ఎప్పట*కప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తూ, వాటికి శాశ్వత పరిష్కారం లభించే వరకు విశ్రమించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మీరా వెంకన్న, ముఖ్య నాయకులు మన్నె భూపతి, వారా సూర్యం, కొమ్మినేని వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ పెన్షన్ మంజూరుకు ప్రజావాణిలో వినతి పత్రం



పెనుబల్లి నవంబర్ 16 (జనంసాక్షి)

పెనుబల్లి మండలం ఎర్ర బంజర గ్రామానికి చెందిన తోట కిషోరతనకు అన్ని విధాల అర్హత ఉన్నా అంద వికలాంగ పెన్షన్ మంజూరు కాలేదని సోమవారం పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగినప్రజావాణిలో ఎంపీడీవో వీరస్వామి కి వినతి పత్రం అందించారు. తనకు పుట్టుకతో అంతత్వం కలిగి ఉన్నారని, కళ్ళు కనిపించకపోవడంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సదరన్ క్యాంపులో పరీక్ష చేయించుకోవడం జరిగిందని, అధికారులు పరీక్షలు నిర్వహించి డిసబుల్టీ సర్టిఫికెట్ లో వికలాంగుల శాతం75% వేసి ఉన్నారని వినతి పత్రంలో పేర్కొన్నాడు. పెన్షన్ కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని అన్ని అర్హతలు ఉన్ననాకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయుటకు సంబంధిత అధికారులకు సిఫార్సు చేయగలరని వినతి పత్రంలో పేర్కొన్నాడు.

ఒక్కొక్క సీసీ కెమెరా లక్షమందితో సమానం

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు సర్కిల్ సిఐ లక్ష్మి

చంద్రుగొండ,నవంబర్ 16 (జనంసాక్షి):

చంద్రుగొండ మండలంలోని ప్రతి గ్రామంలో, పంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జూలూరుపాడు సర్కిల్ సిఐ లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం దామరచర్ల ఎస్సార్ ఫంక్షన్ హాల్ లో చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని అక్కడి హాజరైన ప్రజా ప్రతినిధులకు తమ తమ పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు



ముందుకు రావాలని తెలియజేశారు. ఒక్క సీసీ కెమెరా లక్ష మందితో సమానమని గ్రామాలలో ఎటువంటి నేరాలు జరిగిన దొంగతనాలు జరిగిన ఎటువంటి సంఘటన జరిగిన సీసీ కెమెరాలు ద్వారా వారిని శిక్షించే అవకాశం ఉందని తెలియజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతుగా పంచాయతీ సర్పంచులు అధికారులు ముందుకు రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహకారం అందించాలని తెలపడంతో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు ఎస్సై విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే అభ్యంతరాల పరిష్కారానికి గ్రామసభ

బట్లపల్లిలో రైతులతో మాట్లాడిన ఆర్డీవో శ్రీదేవి.. చట్టప్రకారమే భూముల హద్దుల నిర్ణయం

మర్రిగూడ, నవంబర్ 16 (జనంసాక్షి)

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం బట్లపల్లి గ్రామంలో భూముల రీ సర్వేకు సంబంధించి జారీ చేసిన నోటీసులపై రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికి గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు చండూరు ఆర్డీవో వి. శ్రీదేవి హాజరై రైతులతో నేరుగా మాట్లాడి వారి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బట్లపల్లి గ్రామంలో మొత్తం 356 ఖాతాలు ఉండగా, 388 ల్యాండ్ పార్సెల్ మ్యాపులు (ఎల్‌పీఎంలు) రూపొందించారు. వీటికి సంబంధించి ఇప్పటివరకు 19 అభ్యంతరాలు వచ్చినట్లు తెలిపారు.గ్రామ కంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములు, రహదారులు, పట్టా భూములను సమగ్రంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించినట్లు అధికారులు వివరించారు. రీ సర్వేలో తలెత్తిన వ్యత్యాసాలపై ఇంకా ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులతో ఆర్డీవో శ్రీదేవి స్వయంగా మాట్లాడి



సమస్యలను తెలుసుకున్నారు. భూముల హద్దుల నిర్ణయం చట్టప్రకారమే జరుగుతుందని స్పష్టం చేశారు. సాధ్యమైనంత వరకు అభ్యంతరాలను తగ్గించుకునేలా రైతులు సహకరించాలని కోరారు.ప్రస్తుతం అభ్యంతరాల స్వీకరణకు 60 రోజుల గడువు ఉందని, రానున్న రోజుల్లో ఈ గడువును 25 రోజులకు పరిమితం చేసే అవకాశం ఉందని ఆర్డీవో తెలిపారు. కాబట్టి రైతులు తమ భూములకు సంబంధించిన రీ సర్వే వివరాలను పరిశీలించి ఏవైనా వ్యత్యాసాలు ఉంటే గడువులోగా అధికారులకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, తహసీల్దార్, సర్వేయర్‌తో పాటు రెవెన్యూ శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగుల సమరభేరి

కలెక్టరేట్ ధర్నాకు సామూహిక సెలవు.. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

గుర్రంపోడు, నవంబర్ 16: (జనంసాక్షి)

తమ ఉద్యోగ జీవితానికి, పదవీ విరమణ అనంతర భవిష్యత్తుకు భరోసా కల్పించే పాత పింఛను విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. భాగస్వామ్య పింఛను విధానాన్ని (సీపీఎస్) తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఇచ్చిన పిలుపుకు మద్దతుగా సోమవారం గుర్రంపోడు తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు సామూహిక సెలవు ప్రకటించారు.ఈ మేరకు తహశీల్దార్ ఎన్. కరుణశ్రీకి ఒకరోజు సామూహిక సెలవు దరఖాస్తును అందజేశారు. మంగళవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉద్యోగులు వెల్లడించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం ఉద్యోగుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల పాటు ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణలో భాగంగా



జిల్లా కేంద్రంలో చేపట్టనున్న ధర్నాలో రెవెన్యూ శాఖ సీపీఎస్ ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎండీ ఫరీదుద్దీన్, ఆర్ఎస్ఐలు నీర్, చెన్నకేశవులు, సర్వేయర్ రామనర్సయ్య, జీపీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సందీప్, రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, యాదగిరి, రాంరెడ్డి, విజయ్, శ్రీనివాస్, రమణమ్మ, చాంద్‌పాషా, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే లక్ష్యంగా ప్రజానాట్యమండలి ప్రస్థానం

- హుజూర్‌నగర్‌లో ఘనంగా ప్రజానాట్యమండలి స్వర్ణోత్సవ సంబరాలు
- ప్రజా సమస్యలపై కళారూపాలతో చైతన్యం తీసుకురావాలి
- కళాకారుల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణ
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు : పశ్య పద్మ

హుజూర్‌నగర్ టౌన్ నవంబర్ 16 (జనంసాక్షి):

ప్రజా సమస్యలపై కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రజానాట్యమండలి చేసిన కృషి చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ అన్నారు. పట్టణంలో సోమవారం ప్రజానాట్యమండలి స్వర్ణోత్సవ సంబరాలు జిల్లా అధ్యక్షులు దొంతగాని సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ గుండా రమేష్ స్వాగత ఉపన్యాసం చేయగా, పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పీడిత ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘంగా ప్రజానాట్యమండలి ఏర్పాటైందని గుర్తుచేశారు. అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలను కళారూపాల ద్వారా ఎండగడుతూ, కాళ్లకు గజ్జెలు కట్టి విప్లవ గీతాలు ఆలపించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చిన ఘనత ప్రజానాట్యమండలి కళాకారులదని కొనియాడారు. నేడు ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల హక్కులు, ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు కమ్యూనిస్టు పార్టీల అవసరం ఉందన్నారు. ప్రజా స్వామిక విలువల కోసం పోరాడుతున్న యువతీ యువకుల సేవలు కమ్యూనిస్టు ఉద్యమాలకు అవసరమని పేర్కొన్నారు. ప్రజల కోసం త్యాగాలు చేసిన పోరాటయోధుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.1974లో ప్రారంభమైన ప్రజానాట్యమండలి ప్రస్థానంలో భాగంగా స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహిస్తూ, నాటి పోరాటయోధుల ఘన చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని ఆమె అన్నారు.



ఈ చారిత్రక కార్యాచరణకు కృషి చేసిన జిల్లా అధ్యక్షులు దొంతగాని సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన ఆటపాటలు, విప్లవ గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి. స్వర్ణోత్సవ వేడుకల్లో తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు కే. శ్రీనివాస్, బీసీ సంఘాల రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ నాయుడు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సూర్యనారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జడ శ్రీనివాస్, ప్రముఖ పాత్రికేయులు కేఎస్ఎన్ ప్రసాద్, ప్రొఫెసర్ అంజయ్య, రిటైర్డ్ టీచర్ కేవీఎన్ మూర్తి, కళాకారులు, నాయకులు, అభిమానుల సమక్షంలో ఉత్సాహభరితంగా ముగిశాయి.

శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు

శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తజనం

హాలియా జనంసాక్షి నవంబర్ 16



కార్తీకమాస తొలి సోమవారం పురస్కరించుకొని అనుమల మండల పరిధిలోని పేరూరు యాచారం హాలియా శైవ క్షేత్రాల్లో భక్తజనం కిటకిటలాడింది భక్తులు తెల్లవారుజాము నుంచే నది స్థానాల ఆచరించి శివాలయంలో బిల్వపత్రాలతో అభిషేకాలు పూజలు కార్తిక దీపాల వెలిగించి ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు సాయంత్రం శివాలయంలో ఆకాశ దీపాన్ని దర్శించుకుని భక్తులుమొక్కులు తీర్చుకున్నారు.

ఓజేటిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రిన్సిపల్ నీరజ



నేరేడుచర్ల నవంబర్ 16 (జనంసాక్షి):

ఒకేషనల్ విద్యార్థులు ఆన్ జాబ్ ట్రైనింగ్ ను సద్వినియోగం చేసుకోవాలని నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి నీరజ అన్నారు. సోమవారం కళాశాల ఓఏ ,ఈటి డఏసిపి, ఒకేషనల్ గ్రూపులకు సంబంధించిన మొదటి,ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఓజేటీలో భాగంగా స్థానిక తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థను సందర్శించారు.ఓజేటిని ప్రారంభించిన అనంతరం ఆమె గిడ్డంగులను విద్యార్థులతో పాటు సందర్శించి మాట్లాడారు. వృత్తి విద్య కోర్సు విద్యార్థులకు విద్యతో పాటు ఓజేటి ఎంతో ముఖ్యమని ఇంటర్ విద్య అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు.ఈ ఓజేటితో విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాలకు సంబంధించి ఫీల్డ్ అవగాహన కలుగుతుందన్నారు.తరగతి గదికే పరిమితం కాకుండా ఆయా సంస్థలు కోర్సును బట్టి సందర్శించడం వల్ల ఎంతో నైపుణ్యం చేకూరుతుందన్నారు. దీంతో వృత్తి విద్యా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఏదైనా స్వయం ఉపాధి, ఉద్యోగములో స్థిర పడాలంటే ఈ ఓజేటి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాఠ్యాంశాలు తెలుసుకోవడం ఎంత ముఖ్యమో సంబంధిత పనిపై అవగాహన పొందడం అంతే ముఖ్యమని సూచించారు.ఈ సందర్భంగా గిడ్డంగుల యొక్క ప్రాముఖ్యతపై గిడ్డంగుల సంస్థ మేనేజర్ సఫియాబి,సూపర్వైజర్ రాహుల్ విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరెడ్డి వెంకటరమణ, ఒకేషనల్ లెక్చరర్లు వెంకన్న, కె.శ్రీనివాసులు,ప్రసాదు,వీరు, అపర్ణ, వీరేష్ ఇంగ్లీష్ లెక్చరర్ వి.శ్రీనివాసులు, ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లిలో 49 మందికి

చేయూత పింఛను మంజూరు పత్రాల పంపిణీ



మాడుగులపల్లి, నవంబర్ 16(జనంసాక్షి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్ల కార్యక్రమంలో భాగంగా మాడుగులపల్లి గ్రామానికి చెందిన 49 మంది లబ్ధిదారులకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పింఛను మంజూరు పత్రాలను అందజేశారు మూడు రోజుల క్రితం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించగా, అందులో భాగంగా గ్రామంలోని వితంతువులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలు మరియు దివ్యాంగులైన అర్హులకు ఈ పత్రాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మల్లెపల్లి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, వార్డు సభ్యులు శ్రీను, నాయకులు పుల్లెంల నరసింహ, వెంకట్ రెడ్డి పింఛను లబ్ధిదారులు పాల్గొన్నారు.

కోటి సోమవారం సందర్భంగా మహా అన్నప్రసాద వితరణ ప్రారంభం

ప్రతి సోమవారం భక్తులకు అన్నప్రసాదం అందించనున్న దేవస్థానం కమిటీ

దేవరకొండ, నవంబర్ 16 (జనంసాక్షి):
కార్తీక మాసంలోని పవిత్రమైన కోటి సోమవారం సందర్భంగా దేవరకొండ పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవస్థానంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఇకపై ప్రతి సోమవారం భక్తులకు అన్నప్రసాదం అందించనున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, డిఎస్పి. ఎం.వి. శ్రీనివాసరావు, పద్మశాలీల నిత్య అన్నసత్రం భద్రాచలం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ యేలే యశోద యాదయ్య, దేవస్థానం సీనియర్ న్యాయవాది గాజుల



ఆంజనేయులు, దేవస్థానం అధ్యక్షుడు వనం జగదీశ్వర్ తదితరులు ప్రారంభించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం కోశాధికారి చెరుపెల్లి ఎల్లయ్య, వనం భిక్షమయ్య, చిలువేరు పుల్లయ్య, నామని చంద్రశేఖర్ తదితరులు మహా అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.



నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

సూర్యాపేట (జనంసాక్షి):
ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో డాక్టర్ ఖమ్మంపాటి కృష్ణ గౌడ్, కొండపల్లి కార్తీక్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసిద్ధి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సేవాభావంతో వైద్య సేవలను అందించాలని అన్నారు. సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు.ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, తెలంగాణ పర్యటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెరాటిగూడెం గ్రామానికి చెందిన కత్తి స్వాతికి జేఎన్టీయూహెచ్ డాక్టరేట్

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 16,(జనం సాక్షి):
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం తెరాటిగూడెం గ్రామానికి చెందిన కత్తి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కత్తి స్వాతి డాక్టరేట్ పట్టా పొందేందుకు అర్హత సాధించారు. సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఆమె జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో నవంబర్ 16న నిర్వహించిన మౌఖిక పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు.విశ్వవిద్యాలయ సీనియర్ ఆచార్యులు డాక్టర్ జి. నరసింహ పర్యవేక్షణలో కత్తి స్వాతి తన పరిశోధనను పూర్తి చేశారు. తెలివైన సమాచార ప్రసార జాలాల విశ్లేషణ కోసం లక్షణాల మెరుగుదలతో కూడిన సమర్థవంతమైన లోతైన అభ్యసన నమూనా అనే అంశంపై పరిశోధన చేపట్టారు. సమాచార ప్రసార జాలాల్లో సమాచార మార్పిడిని సమర్థవంతంగా విశ్లేషించేందుకు లోతైన అభ్యసన నమూనాల సామర్థ్యాన్ని పెంపొందించే అంశాలపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, ప్రధానాచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది కత్తి స్వాతిని అభినందించారు. స్వాతి డాక్టరేట్ సాధించడంతో తెరాటిగూడెం గ్రామంలో ఆనందం వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.



సినిమా షూటింగ్ లో నారాయణపురం యువకులు

సంస్థాన్ నారాయణపురం. నవంబర్ 16 (జనంసాక్షి):



సినీ హీరో సత్యదేవ్,సీనియర్ నటుడు శ్రీకాంత్ నటిస్తున్న సినిమా డైరెక్టర్ అజయ్ నాగ్ దర్శకత్వం వహిస్తున్న సమవర్తి మూవీ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహించిన షూటింగ్ లో భాగంగా చిన్నచిన్న పాత్రలను నారాయణపురంలో కలని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చి కళాకారులు ఈ యొక్క పెద్ద ప్రాజెక్టుకు సంబంధించిన సినిమాలో నటులుగా ×గంగాపురం సాయి గౌడ్, శికిలమెట్ల ప్రభాకర్, అందే నరేష్, బైకని నరేందర్ యాదవ్, పాలకూర్ల శివ, కొండ అయాన్ గౌడ్× నటించడం జరిగింది..ఈ యొక్క పాత్రలలో అడవులలో వన్యప్రాణులు ఉండడంతో ఆ ప్రాంతమంతా సంచరించే చిత్రాలను ఫారెస్ట్ అధికారులుగా, రైతుల పాత్రలలో వివిధ వేషధారాలు వేయడం జరిగింది..అలాగే అమ్మ,అక్క, తమ్ముడి మధ్య జరిగే చిత్రాలను చిత్రీకరించారు. ఇలాంటి కల నైపుణ్యాన్ని తెరమీదకి మిలాంటి వారు నటీనటులుగా ముందుకు సాగాలని డైరెక్టర్ అజయ్ నాగ్ కొనియాడారు. ఆయన చిత్రంలో నటించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో ధ్వంసమైన మిషన్ భగీరథ పైపులైన్లు..

వారం రోజులుగా గ్రామాల్లో అల్లాడుతున్న తాగునీటి ఎద్దడి

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సర్పంచ్ వినతి

మాడ్గులపల్లి, నవంబర్ 16(జనం సాక్షి):



మాడ్గులపల్లి మండల పరిధిలోని గోపాలపురం గ్రామ పంచాయతీలో రోడ్డు విస్తరణ పనుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కన్నెకల్ జంక్షన్ నుండి తిప్పర్తి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గోపాలపురం, దేవునిగోపాలపురం గ్రామాల్లోని మిషన్ భగీరథ,ఇతర తాగునీటి పైపులైన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయిపైపులు పగిలిపోవడంతో గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయి, గత వారం రోజులుగా ప్రజలు తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. ఈ సమస్యపై రోడ్డు విస్తరణ అధికారులను ప్రశ్నిస్తే తమకు ఎలాంటి సంబంధం లేదంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తున్నారని గ్రామ సర్పంచ్ వీరబోయిన నాగరాజు మండిపడ్డారు గ్రామంలో నెలకొన్న తీవ్ర నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుత సోమవారం ఆయన మాడ్గులపల్లి ఎంపీడీఓ కు లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. తక్షణమే సంబంధిత రోడ్డు విస్తరణ, మిషన్ భగీరథ అధికారులను అప్రమత్తం చేసి దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని, గ్రామస్తుల నీటి కష్టాలు తీర్చాలని ఆయన తన వినతిపత్రంలో కోరారు ఆయన వెంట పంచాయతీ సెక్రెటరీ ఉన్నారు.

చిట్యాల మున్సిపాలిటీకి కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. అర్హులందరికీ చేయూత పింఛన్లు: ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల, నవంబర్ 16 (జనం సాక్షి):
చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం సోమవారం చిట్యాల వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వికలాంగులు, చేనేత కార్మికులు, వితంతువులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు ఈ విడతలో పింఛన్లు నిర్మించాలని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ, వాటిని అధిగమిస్తూ ప్రస్తుత ప్రభుత్వం సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.చిట్యాల



మున్సిపాలిటీకి నూతన మున్సిపల్ భవనం మంజూరైందని, త్వరలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌తో పాటు 30 పడకల ఆసుపత్రిని కూడా మంజూరు చేయించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వినోద్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి, సైదులు, కౌన్సిలర్లు నాగిళ్ల సుధాకర్, గాలి యాదమ్మ లింగయ్య, కోనేటి ఎల్లయ్య, జెర్రిపోతుల సత్యనారాయణ, దేశపాక లత రాజేష్, కుక్కల మోహన్, ఏర్పుల పరమేష్, బొబ్బలి సందీప్ రాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పోకల దేవదాస్, టౌన్ అధ్యక్షుడు ఎద్దులపూరి కృష్ణ, బెల్లి సత్తయ్య, ఎస్కేషహది ఇబ్రహీం, ఇమ్రాన్ ,జయారపు శివ ప్రసాద్, కోసననీ అశోక్, శ్రీకాంత్ చారి, కళ్లెం నరసింహ, సల్ల రాజు,కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తుంగతుర్తిలో కుమ్మరుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ

తుంగతుర్తి నవంబర్ 16 (జనం సాక్షి)

కుమ్మరుల నైపుణ్య అభివృద్ధి కోసం సాంప్రదాయ కుమ్మరి వృత్తికి ఆధునిక సాంకేతికతను జోడించి, వృత్తిదారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం జిల్లా కన్వీనర్ చలిగంటి శ్రీనివాస్ అన్నారు, సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని కుమ్మరి సంఘం భవనంలో కుంబార్ శక్తి కరణ్ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్చార్జి కోతమర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సారే నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు, భారత ప్రభుత్వ సూక్ష్మ, లఘు మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కే.వి.ఐ.సి) ద్వారా కుంభార్ సశక్తీకరణ్ శిక్షణ ద్వారా కుమ్మరులకు మేలు జరుగుతుందని అన్నారు గ్రామోద్యోగ్ వికాస్ యోజన 2026-27లో భాగంగా కుమ్మరి సారె నైపుణ్యాభివృద్ధి శిక్షణ పేరుతో నవంబర్ 16 నుంచి 25వ తేదీ వరకు పది రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా సంప్రదాయ కుమ్మరి వృత్తిదారులకు ఆధునిక పద్ధతుల్లో



కుండలు, మట్టి పాత్రలు, ఇతర మట్టి ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు వృత్తిదారుల ఆదాయాన్ని మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జ్ సలిగంటి వీరేంద్ర మాట్లాడుతూ కుమ్మరి వృత్తిని ప్రోత్సహించడం, సంప్రదాయ కళను కాపాడటం, గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడం ద్వారా వృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందనీ, వికసిత్ భారత్, మై ఖాదీ మై ప్రైడ్ నినాదాలకు అనుగుణంగా సంప్రదాయ వృత్తులకు కొత్త జీవం పోసే దిశగా ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడనుందనీ, ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ లంక, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎన్. లతా దేవి వీడియో కాల్ ద్వారా పర్యవేక్షించగా వారికి, ట్రైనర్ మరికొండ నరసింహస్వామి కి కుమ్మర సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ ఖమ్మంపాటి మధుసూదన్, వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు కాసుల లింగయ్య, జిల్లా కన్వీనర్ మద్దికుంట్ల ఎల్లయ్య, సూర్యాపేట పట్టణ అధ్యక్షులు సలిగంటి నాగయ్య, జిల్లా నాయకులు నీలకంఠం జయ రామకృష్ణ, చివ్వెంల మండల అధ్యక్షులు మర్రిపడగ నాగరాజు, శిక్షణ కొరకు విచ్చేసిన వృత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

రాంరెడ్డిపల్లిలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6,500 ప్రభుత్వ ఆర్థిక సాయం

మర్రిగూడ, నవంబర్ 16 (జనంసాక్షి)



భూగర్భ జలాలను పెంపొందించి, వర్షపు నీటిని ఒడిసిపట్టే లక్ష్యంతో మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా ఆధ్వర్యంలో గ్రామంలోని కాటిక ప్రమీల, సంధ్య యాదమ్మ, అయితగోని రాజు, వడ్డె కిరణ్, పగిళ్ల కోటయ్యల నివాసాల వద్ద నూతన ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లపంగి నర్సింహా మాట్లాడుతూ.. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుందని పేర్కొన్నారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామంలో ఇంకుడు గుంతలు లేని ప్రతి ఒక్కరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొగాకు పెద్ద సైదులు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాగుల రాములు, వార్డు సభ్యులు భీమనగోని మల్లమ్మ, యాదయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సల్వోజ్ యాదయ్య, పగిళ్ల యాదమ్మ, శంకర్, కొత్త లింగస్వామి, లపంగి మహేందర్, కడారి ఎర్రయ్య, పగిళ్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సదర్ ఉత్సవాలు

- సదర్ యాదవుల కదర్.. లడ్డన్న పాటతో మార్మోగిన మర్రిగూడ
- కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రసంగంతో ఉర్రూతలూగిన యువత..
- ప్రత్యేక ఆకర్షణగా దున్నపోతుల విన్యాసాలు

మర్రిగూడ, నవంబర్ 16 (జనం సాక్షి)

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలు నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. మండల కేంద్రానికి చెందిన కన్నెబోయిన శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన ఈ ఉత్సవాలు యాదవ సోదరులు, యువతలో నూతన ఉత్సాహాన్ని నింపాయి. వావ్ లడ్డన్న.. వారెవా లడ్డన్న పాటలతో ఉత్సవ ప్రాంగణం మార్మోగగా, యాదవుల సంబరాలు అంబరాన్నంటాయి. దున్నపోతుల విన్యాసాలు, సాంస్కృతిక సందడి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఒకప్పుడు సదర్ ఉత్సవాలను చూడాలంటే హైదరాబాద్ నగరానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, అలాంటి వేడుకలను తొలిసారిగా మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కన్నెబోయిన శంకర్ యాదవ్ ఎంతో శ్రమించి, సమన్వయంతో ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

యాదవుల ఐక్యత, నీతి నిజాయితీ ఆదర్శనీయం: కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి





ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సదర్ యాదవుల కదర్, వారి ఐక్యత, నీతి నిజాయితీ సమాజానికి ఆదర్శమని కొనియాడారు. సదర్ ఉత్సవాలు యాదవుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో తొలిసారిగా ఇంతటి ఘనంగా సదర్ ఉత్సవాలను నిర్వహించిన కన్నెబోయిన శంకర్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ప్రసంగంతో యువకులు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. దీంతో ఉత్సవ ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది.

రాజకీయాల్లోనూ యాదవులు రాణించాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్ మాట్లాడుతూ.. తాను ఇక్కడికి ఒక ఎమ్మెల్సీగా మాత్రమే కాకుండా యాదవ బిడ్డగా సదర్ ఉత్సవాలకు హాజరయ్యానని అన్నారు. న్యాయం ఎక్కడ ఉంటే యాదవులు ఆ వైపే నిలబడతారని పేర్కొన్నారు. యాదవులు విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ అక్షరాస్యతలో ముందుండాలని, అదే సమయంలో రాజకీయ రంగంలోనూ రాణించి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

మర్రిగూడకు గర్వకారణం: సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్

మర్రిగూడ సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ మాట్లాడుతూ.. మర్రిగూడ మండల కేంద్రంలో తొలిసారిగా సదర్ ఉత్సవాలు నిర్వహించడం, తాము సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే ఈ వేడుకలకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఎంతో కష్టపడి ఇంతటి ఘనమైన కార్యక్రమాన్ని నిర్వహించిన కన్నెబోయిన శంకర్ యాదవ్ కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు మర్రిగూడ గ్రామానికి గర్వకారణంగా నిలిచాయని అన్నారు.

యాదవుల ఆత్మగౌరవం, ఐక్యత, సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టిన ఈ సదర్ ఉత్సవాలు మర్రిగూడలో పండుగ వాతావరణాన్ని నింపాయి. దున్నపోతుల విన్యాసాలు, యువత ఉత్సాహం, ప్రజల సందడితో ఆదివారం రాత్రి మర్రిగూడలో సదర్ సంబరాలు ప్రత్యేక గుర్తింపును సంతరించుకున్నాయి.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట(జనంసాక్షి):
ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 152 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈవో శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిడబ్ల్యుఓ నరసింహారావు, డిఐఈఓ సులోచన రాణి, డివైఎస్ఓ వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి.. రైతుకు ఆర్థిక నష్టం



వలిగొండ, నవంబర్ 16 (జనం సాక్షి)
మండలంలోని వెలువర్తి గ్రామానికి చెందిన మందుల కృష్ణకు చెందిన ఆవు సోమవారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ శివారులోని పులిగిల్ల రవీందర్ రెడ్డి బావి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, రోజుకు 8 లీటర్ల పాలు ఇచ్చేదని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. ఆవు మృతితో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని బాధితుడు కోరారు.

ఘనంగా కుంభం రమణారెడ్డి 24వ వర్ధంతి వేడుకలు



వలిగొండ, నవంబర్ 16 (జనంసాక్షి)
వలిగొండ గ్రామ వంచాయతీ వార్డు సర్పంచ్ స్వర్గీయ కుంభం రమణారెడ్డి 24వ వర్ధంతి వేడుకలను సోమవారం అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుమారు 40 సంవత్సరాలు సర్పంచ్‌గా సేవలందిస్తూ గ్రామ అభివృద్ధికి, నిరుపేదల సంక్షేమానికి విశేష కృషి చేశారని కొనియాడారు. బస్టాండ్, విద్యుత్ సబ్‌స్టేషన్, సింగిల్ విండో భవనాల కోసం తన సొంత భూమిని అందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకిరాములు, కాంగ్రెస్ నాయకులు , ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల గోడు వినేందుకు ప్రజావాణి

వలిగొండ, నవంబర్ 16 (జనంసాక్షి)
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో, నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 5 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యల స్వభావాన్ని బట్టి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా, నేరుగా అధికారులకు తమ ఇబ్బందులను తెలియజేసేందుకు ప్రజావాణి ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఒకే వ్యక్తికి రెండు పదవులా? విచారణ జరపాలని బీజేపీ వినతి!

మహిళా సమాఖ్యలో బాధ్యతలతో పాటు వార్డు సభ్యురాలిగా కొనసాగుతున్నారంటూ ఆరోపణ



మర్రిగూడ,నవంబర్ 16 (జనం సాక్షి) :
మర్రిగూడ మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన ఐతపాక కల్పన ఒకేసారి రెండు బాధ్యతలు నిర్వహిస్తున్నారనే అంశంపై విచారణ జరిపించాలని బీజేపీ పార్టీ మర్రిగూడ మండల శాఖ అధికారులను కోరింది. మహిళా సమాఖ్యలో బీడీస్పీగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వపరంగా లబ్ధి పొందుతున్నారని, అదే సమయంలో గ్రామ వార్డు సభ్యురాలిగా కూడా కొనసాగుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు.ఈ మేరకు బీజేపీ మర్రిగూడ మండల అధ్యక్షుడు పాత్తావత్ రాజేందర్ నాయక్ ఎంపీడీఓ మునయ్యకు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకే వ్యక్తి మహిళా సమాఖ్యలో బాధ్యతలు నిర్వహిస్తూ, మరోవైపు గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలిగా కొనసాగేందుకు అర్హత ఉందా? లేదా? అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. రెండు పదవులు ఏకకాలంలో నిర్వహించడంపై నిబంధనలు ఏమి చెబుతున్నాయో సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా రెండు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు.ఈ వ్యవహారంపై ఎంపీడీఓ కార్యాలయం ఎలాంటి విచారణ చేపడుతుంది? అధికారుల పరిశీలనలో ఏ విషయాలు వెలుగులోకి వస్తాయన్నది చర్చనీయాంశంగా మారింది.

గుడిపల్లి ఎస్ఐగా బి.రాజు నియామకం

- నల్గొండ వీఆర్‌కు బదిలీపై నర్సింహులు



పి.ఏ.పల్లి,నవంబర్ 16(జనంసాక్షి):
నల్లగొండ జిల్లా గుడిపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా బి.రాజు సోమవారం నాడు బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న నర్సింహులు నల్గొండ వీఆర్ కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రాజు మాట్లాడుతూ శాంతి భద్రతలు కొరకై ఉమ్మడి మండలం ప్రజలు సహకరించాలని కోరారు.ప్రజల సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించలన్నారు. శాంతి భద్రతలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారు అని ఆయన హెచ్చరించారు.

శివన్నగూడెం ప్రాజెక్టు కోసం 'ముఖ్యమంత్రికి ఉత్తరం' ఉద్యమం

- **రానున్న రోజుల్లో 10 లక్షల ఉత్తరాలు రాసే కార్యక్రమానికి శ్రీకారం**
- **రాచకొండ డీపీఆర్ పనులను తక్షణమే ప్రారంభించాలి**
- **మునుగోడు, దేవరకొండ రైతులను కరువు నుండి ఆదుకోవాలి**
- **మీడియా సమావేశంలో ఇ ఎల్‌వి భాస్కర్ పిలుపు**

చౌటుప్పల్ నవంబర్ 16(జనంసాక్షి)
మునుగోడు, దేవరకొండ ప్రాంతాల చిరకాల ఆకాంక్ష అయిన శివన్నగూడెం ప్రాజెక్టును పూర్తి చేయాలని, రాచకొండ ఎత్తిపోతల పథకం డీపీఆర్ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రానున్న రోజుల్లో 10 లక్షల ఉత్తరాలు రాసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఇఎల్‌వి భాస్కర్ ప్రకటించారు. శివన్నగూడెం ప్రాజెక్టు సాధన కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు ముందుకు రావడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. గడిచిన 20 ఏళ్లుగా ఈ ప్రాజెక్టు కోసం ఎవరూ గట్టిగా ముందుకు రాకపోవడంతో, తాను దీనిని ఒక ప్రధాన లక్ష్యంగా తీసుకున్నానని తెలిపారు.శుక్రవారం సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇ ఎల్‌వి భాస్కర్ మాట్లాడుతూ ప్రాంతీయ సమస్యలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక ఈ ప్రాంతం కరువు మండలంగా ప్రకటించ బడిందని ఆవేదన వ్యక్తం చేశారు. శివన్నగూడెం, రాచకొండ ప్రాంతాలకు సాగునీరు అంది ఉంటే నేడు కరువు పరిస్థితులు దాపురించేవి కావని అన్నారు.

పత్తి రైతుల దయనీయ స్థితి

ప్రస్తుతం మార్కెట్లో బియ్యానికి భారీ డిమాండ్ ఏర్పడిందని, దళారులు నేరుగా కళ్లాల వద్దకే వచ్చి వరిని కొనుగోలు చేస్తున్నారని భాస్కర్ తెలిపారు. రానున్న రోజుల్లో బియ్యం ధర కిలో రూ. 200 నుండి రూ. 300 వరకు చేరే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన లేకపోవడంతో మునుగోడు, దేవరకొండ రైతులు కేవలం పత్తి పంటపైనే ఆధారపడి తీవ్రంగా నష్టపోతున్నారని, పత్తి సాగు ఈ ప్రాంత రైతులకు శాపంగా మారిందని పేర్కొన్నారు.కరువు పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేయాలో రైతులకు సరైన మార్గదర్శకత్వం కరువైందన్నారు.

ఇంటింటికీ 'ముఖ్యమంత్రికి ఉత్తరం' కార్యక్రమం

ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే శివన్నగూడెం, రాచకొండ ప్రాజెక్టుల ద్వారా నీళ్లు రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇందుకోసం మునుగోడు నియోజకవర్గంలోని ఏడు మండలాలు, దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో ప్రతి ఇంటి నుండి ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాసే మహాయజ్ఞాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. 5 ఏళ్ల పిల్లల నుండి పెద్దల వరకు ప్రతి ఒక్కరినీ ఇందులో భాగస్వాములను చేస్తామన్నారు. ప్రజల సమయం వృథా కాకుండా తమ బృందం ముందుగానే ముద్రించిన ఉత్తరాలను ఇంటింటికీ



తీసుకెళ్లి, వారి పేరు, ఊరు మరియు సంతకాలు సేకరిస్తుందని వివరించారు. ఈ ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయడంలో మీడియా మిత్రుల అనుభవం, సహకారం ఎంతో అవసరమని కోరారు. నియోజకవర్గంలో ఎలాంటి ప్రజా సమస్యలు ఉన్నా మీడియా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారం కోసం తాము ముందుండి పనిచేస్తామని హామీ ఇచ్చారు. మునుగోడు ప్రజల కల అయిన శివన్నగూడెం ప్రాజెక్టు పూర్తయ్యే వరకు అందరం కలిసికట్టుగా పోరాడుదామని పత్రికా ముఖంగా ఆయన పిలుపునిచ్చారు.